ANN తెలుగు

Follow: @ANNTELUGU

03-08-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 240 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM






WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# దేశంలో రాజకీయ మార్పులు?

***భారత రాజకీయాలు ఒక సవాళ్లతో కూడిన దశలో ఉన్నాయి. రాహుల్ గాంధీ ఆరోపణలు, మోదీ నాయకత్వంపై ఒత్తిడి, మరియు అంతర్జాతీయ ఆర్థిక సవాళ్లు రాబోయే నెలల్లో రాజకీయ సంచలనాలకు, మార్పులకు కారణాలుగా మారే సూచనలున్నాయి. వాస్తవానికి భారత రాజకీయాలు 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఒక కీలకమైన మలుపు తీసుకున్నాయి. ఇపుడు రాహుల్ గాంధీ రిగ్గింగ్ ఆరోపణలు, బీజేపీపై దూకుడైన విమర్శలు, మరియు ఆర్థిక సవాళ్లు రాజకీయ వాతావరణాన్ని తీవ్రతరం చేశాయి. మోదీ నాయకత్వం ఎన్డీఏ భాగస్వాములపై ఆధారపడడంతో పాటు అటు దౌత్య సవాళ్లు.. ఇటు ప్రతిపక్షాల సవాళ్లు, 75ఏళ్ల నిబంధనపై పార్టీలోని కీలక నేతల ఆశలు కలగలసి దేశ రాజకీయాల్లో సరికొత్త మార్పులు జరగవచ్చన్న సంకేతాన్ని కలిగిస్తున్నాయి. దేశ రాజకీయాల్లో ఏదో జరగబోతుందన్న ఆసక్తిని కలిగిస్తున్నాయి. గతంలో ట్రంప్ తో ప్రధాని మోదీ చేసిన స్నేహం ఇపుడు ఆయన ప్రతిష్టపై ప్రభావం చూపుతోంది.***

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

లోక్ సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. దాదాపు 100 సీట్లలో ఎన్నికల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరుపై ప్రజల్లో అనుమానాలున్నాయి. మహారాష్ట్రలో చాలా చోట్ల ఆశ్చర్యకరమైన ఫలితాలొచ్చాయి. అయితే ఎన్నికల సంఘం రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించిందని, ఎన్నికల వ్యవస్థ రాజీపడిందన్న వాదనలను ఎన్నికల సంఘం అనేకమార్లు కొట్టివేసింది. అయితే కొన్ని నియోజకవర్గాల్లో 1.5 లక్షల ఫేక్ ఓట్లు వేశారని, తమ వద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని రాహుల్ గాంధీ పేర్కొంటున్నారు. తాము ఆధారాలు బయటపెడితే ఎన్నికలసంఘం ప్రజలకు కనబడకుండా దాక్కోవాల్సిన పరిస్థితి కూడా ఉంటుందని ఆయన చెబుతున్నారు. దేశంలో ఎన్నికల వ్యవస్థపై గత కొన్ని రోజులుగా అనుమానాలు వ్యక్తమవుతుండగా, బిహార్ లో ప్రారంభించిన లక్షల ఓట్ల తొలగింపు, కొత్తగా పెద్ద ఎత్తున ఓట్ల చేర్పు కార్యక్రమాలతో దేశంలో అలజడి మొదలైంది. ఎన్నికల సంఘంపై ఆరోపణలకు స్థిరమైన ఆధారాలు లేకున్నా.. సామాన్యప్రజల్లో కూడా అనుమానాలున్నవి. పోలింగ్ ముగియగానే పర్సంటేజీలు ప్రకటించకపోవడం, ముందు ఉన్న పర్సంటేజీకి.. పోలింగ్ తర్వాత ఒకటి.. రెండురోజులకు ప్రకటించే పర్సంటేజీలకు భారీ వ్యత్యాసాలుండడం అనుమానాలు పెంచే ఘటనలు. ఈ అనుమానాలను తొలగించడంలో, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంలో ఎన్నికల సంఘం తడబడుతున్నది.

రాహుల్ గాంధీ ఆరోపణలు రాజకీయ చర్చను రేకెత్తించినప్పటికీ, గట్టి ఆధారాలు ఇప్పటిదాకా ప్రదర్శించకపోవడం వల్ల ఇవి ఇప్పటిదాకా నిరూపితం కాలేదు. ఈ ఆరోపణలు ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని ప్రశ్నించేలా చేసినప్పటికీ, ఆధారాలు కనుక బయటపెడితే ఇది నిజంగా పెనుసంచలనమే. ఏపీకి సంబంధించి 2019లోనూ, 2024లోనూ రెండు సందర్భాల్లోనూ ఇలాంటి ఆరోపణలు వినిపించాయి. వీటికి స్థిరమైన ఆధారం లేదు. అనుమానం మాత్రమే ఉంది.

2024 లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 99 సీట్లు రావడం, రాహుల్ రాయ్‌బరేలీ, వాయనాడ్‌లలో విజయం సాధించడం రాహుల్ రాజకీయ బలాన్ని పెంచాయి. కేవలం 15 సీట్ల తేడాతో ఇండియా కూటమి అధికారం కోల్పోగా, వంద సీట్లలో తప్పిదాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది .సామాజిక మాధ్యమాల్లో రాహుల్ వ్యాఖ్యలు రెండు వర్గాలను సృష్టించాయి. ఒకవైపు ఆయన విమర్శలను సమర్థించే వారు, మరోవైపు బీజేపీ అనుకూల సమూహాలు. అయితే, ఆరోపణలను ఆధారాలతో నిరూపించకపోతే, ఈ విమర్శలు కేవలం రాజకీయ లాభం కోసమే అని భావించే ప్రమాదం ఉంది. అయితే రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష నాయకులు తమ ఆరోపణలకు ఆధారాలు త్వరలో బహిర్గతం చేస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు బహిర్గతమైన ఆధారాలు న్యాయస్థానాల్లో గట్టిగా నిలబడలేదు. రాహుల్ సూచించిన "అణుబాంబు" ఆధారాలు నిర్దిష్టంగా ఉంటే, అవి దేశ రాజకీయాల్లో పెను మార్పులకు కారణమవుతాయి. ఆధారాలు బహిర్గతమైతే, అవి రాజకీయంగా పేలుడు సృష్టించవచ్చు, కానీ వాటి నిజాయితీ, బలం ఆధారంగా దాని ప్రభావ తీవ్రత ఉంటుంది.

2024 ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజారిటీ రాలేదు. ఎన్డీఏ భాగస్వాములపై ఆధారపడవలసి రావడం మోదీకి సవాళ్లను పెంచింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, బీహార్‌కు ఆర్థిక ప్యాకేజీ వంటి డిమాండ్లు మోదీ ప్రభుత్వాన్ని ఒత్తిడిలో ఉంచాయి. మరోవైపు ప్రతిపక్ష నేతగా రాహుల్ దూకుడు, ఆర్థిక, సామాజిక సవాళ్లు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మరియు సామాజిక అసమానతలపై ప్రజల అసంతృప్తి బీజేపీకి సవాల్ గా మారింది. మోదీ ఈ ఏడాది సెప్టెంబర్ 17తో 75 ఏళ్ళలోకి ప్రవేశిస్తారు. 75ఏళ్ళు వచ్చిన అద్వానీ, మనోహర్ జోషీ లాంటి నేతలను గతంలో మార్గదర్శక మండలికి పంపారు. ఇపుడు మోదీకి అదే సూత్రం వర్తిస్తుందా? వర్తించదా? అన్న ప్రశ్నలు ఉన్నాయి. మోదీ రిటైర్మెంట్ అయితే ఆ సీటుపై అనేకమంది హేమాహేమీలు కన్నేశారు. ప్రధానంగా హోంమంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్లు ఈ జాబితాలో ప్రముఖమైనవి. మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన మోదీ బహిరంగంగా పీఎం సీటు వదిలేది లేదని చెప్పకపోయినా, ఆయన చర్యలు, రాజకీయ కార్యకలాపాలు ఆయన పూర్తి కాలం పదవిని కొనసాగిస్తారని సూచిస్తున్నాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మోదీకి మద్దతు ఇస్తూనే, భవిష్యత్ నాయకత్వంపై చర్చలను ప్రోత్సహిస్తోందని నివేదికలు సూచిస్తున్నాయి.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం జరిగిన ఏఐసీసీ కాన్ క్లేవ్ లో బీజేపీలో 75 ఏళ్ల వయోపరిమితి నియమాన్ని ప్రస్తావించారు, రేవంత్ ఈ అంశాన్ని బీజేపీలో అంతర్గత చర్చలను రేకెత్తించడానికి, మోదీ నాయకత్వంపై ఒత్తిడి పెంచడానికి ఉపయోగించారు. ఇది కాంగ్రెస్‌కు రాజకీయ లాభం తెచ్చే ఎత్తుగడగా భావించవచ్చు. లోక్ సభ ఎన్నికలకు ముందు బీజేపీ ఈ నియమం మోదీకి వర్తించదని, ఆయన ప్రధానమంత్రిగా కొనసాగుతారని స్పష్టం చేసింది. అయితే ఇపుడు ఆ పార్టీ నుండి ఈ స్థాయిలో గొంతులు వినిపించడం లేదు. రేవంత్ వ్యాఖ్యలు రాజకీయ ఎత్తుగడలో భాగంగా కనబడుతున్నాయి. బీజేపీలో నాయకత్వ చర్చలను రేకెత్తించడం ద్వారా కాంగ్రెస్‌కు లాభం చేకూర్చడమే లక్ష్యం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ కు సవాళ్ళు విసిరి అభ్యర్థులను మార్చకుండా చేసి బోల్తా కొట్టించారు. ప్రత్యర్థులను రింగ్ లోకి లాగడంలో ముఖ్యమంత్రి రేవంత్ కు నేర్పరి అన్న పేరుంది. ఇపుడు జాతీయరాజకీయాల్లో రాహుల్ కు చేదోడుగా రేవంత్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఆర్ ఎస్ ఎస్ బహిరంగంగా మోదీకి మద్దతు ఇస్తోంది, కానీ దీర్ఘకాల నాయకత్వ పరివర్తనపై చర్చలు జరుగుతున్నాయని జాతీయ విశ్లేషణలు చెబుతున్నాయి. ఆర్ ఎస్ ఎస్, బీ జేపీలో 75 ఏళ్ల తర్వాత నాయకులు రాజకీయ బాధ్యతల నుండి తప్పుకోవాలనే అనధికారిక నియమం ఉంది, దీనిని లాల్ కృష్ణ అద్వాణీ, మురలీ మనోహర్ జోషీ వంటి నాయకుల విషయంలో అమలు చేశారు. ఇటీవల మోహన్ భగవత్ కూడా దీనిని ప్రస్తావించడంతో రాజకీయ దుమారం రేగింది. మోదీ వయస్సు మరియు బీజేపీ నాయకత్వంపై దీర్ఘకాల చర్చలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 17 తర్వాత ఈ చర్చలు తీవ్రతరం కావచ్చు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025లో తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక దేశాలపై టారిఫ్ లు వేస్తున్నారు. భారత్ పాకిస్థాన్ యుద్ధం తానే ఆపానని 30సార్లు ప్రకటించిన ట్రంప్ దీనిని భారత్ ఖండించేసరికి టారిఫ్ లతో ప్రతీకారం ప్రదర్శిస్తున్నాడు. పాకిస్తాన్ తో సంబంధాలు.. ఒప్పందాలు అంటూ ఆచరణ సాధ్యం కాని ప్రకటనలు చేస్తున్నాడు. భారత్‌అమెరికా సంబంధాలను బలోపేతం చేయడానికి మోదీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరుపుతోంది. ట్రైడ్ డీల్ పై ఇప్పటికే రెండుదేశాల మధ్య ఐదుసార్లు చర్చలు జరిగాయి. ట్రంప్ టారిఫ్‌లు భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చి, మోదీ ప్రభుత్వంపై రాజకీయంగా ప్రభావం చూపవచ్చు. దీనిని ఎదుర్కోవడానికి భారత్ వాణిజ్య వ్యూహాలను సమీక్షించాల్సి ఉంటుంది. అయితే పార్లమెంట్ లో ఆపరేషన్ సింధూర్, పహల్గాం ఎటాక్ లపై చర్చ సందర్భంగా భారత్ పాక్ కాల్పుల విరమణను ట్రంపే మొదట ప్రకటించారు. తానే మధ్యవర్తినని 30సార్లు ప్రకటించుకున్నారు. భారత్ పాక్ డిజిల స్థాయిలోనే చర్చలు జరిగాయని భారత్ అంటోంది. తరచూ ట్రంప్ రెచ్చగొడుతున్నా భారత్ ఎదురుదాడి చేయకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ట్రంప్ జోక్యం, ప్రకటనలపై భారతీయుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ట్రంప్ జోక్యంపై సమాధానం చెప్పలేని స్థితిలో కేంద్రప్రభుత్వం ఉండిపోయింది. ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఎక్కడా ట్రంప్ పేరును ప్రస్తావించలేదని రాహుల్ పలుమార్లు ఉడికించినా స్పందించకుండా ఉండిపోయారు. ఇది భారత ప్రజల ముందు సమాధానం దొరకని, అనుమానం కలిగించే ప్రశ్న. ఎన్నికల నిర్వహణపై అనుమానం లాగానే.. ఈ యుద్ధం ఎవరు ఆపారనే ప్రశ్నలు తొలుస్తున్నాయి. మన కంటే ముందే ట్రంపే యుద్ధం ఆగిందని ఎలా చెప్పారు? కేంద్రం చెప్పదు. బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపారనే ప్రశ్నలాగే యుద్ధ విరమణ మిస్టరీ ఉందన్న విశ్లేషణలు జాతీయ రాజకీయాల్లో ఉన్నాయి.



> **లోక్ సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. దాదాపు 100 సీట్లలో ఎన్నికల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరుపై ప్రజల్లో అనుమానాలున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో 1.5 లక్షల ఫేక్ ఓట్లు వేశారని, తమ వద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని రాహుల్ గాంధీ పేర్కొంటున్నారు.**

> **ప్రధాని మోదీ ఈ ఏడాది సెప్టెంబర్ 17తో 75 ఏళ్ళలోకి ప్రవేశిస్తారు. 75ఏళ్ళు వచ్చిన అద్వానీ, మనోహర్ జోషీ లాంటి నేతలను గతంలో మార్గదర్శక మండలికి పంపారు. ఇపుడు మోదీకి అదే సూత్రం వర్తిస్తుందా? వర్తించదా? అన్న ప్రశ్నలు ఉన్నాయి. మోదీ రిటైర్మెంట్ అయితే ఆ సీటుపై అనేకమంది హేమాహేమీలు కన్నేశారు.**

> **ఎన్నికల సంఘంపై ఆరోపణలకు స్థిరమైన ఆధారాలు లేకున్నా.. సామాన్యప్రజల్లో కూడా అనుమానాలున్నవి. పోలింగ్ ముగియగానే పర్సంటేజీలు ప్రకటించకపోవడం, ముందు ఉన్న పర్సంటేజీకి.. పోలింగ్ తర్వాత ఒకటి.. రెండురోజులకు ప్రకటించే పర్సంటేజీలకు భారీ వ్యత్యాసాలుండడం అనుమానాలు పెంచే ఘటనలు. ఈ అనుమానాలను తొలగించడంలో, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంలో ఎన్నికల సంఘం తడబడుతున్నది.**

> **తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం జరిగిన ఏఐసీసీ కాన్ క్లేవ్ లో బీజేపీలో 75 ఏళ్ల వయోపరిమితి నియమాన్ని ప్రస్తావించారు, రేవంత్ ఈ అంశాన్ని బీజేపీలో అంతర్గత చర్చలను రేకెత్తించడానికి, మోదీ నాయకత్వంపై ఒత్తిడి పెంచడానికి ఉపయోగించారు. ఇది కాంగ్రెస్‌కు రాజకీయ లాభం తెచ్చే ఎత్తుగడగా భావించవచ్చు. లోక్ సభ ఎన్నికలకు ముందు బీజేపీ ఈ నియమం మోదీకి వర్తించదని, ఆయన ప్రధానమంత్రిగా కొనసాగుతారని స్పష్టం చేసింది. అయితే ఇపుడు ఆ పార్టీ నుండి ఈ స్థాయిలో గొంతులు వినిపించడం లేదు.**

> **ఎన్నికల నిర్వహణపై అనుమానం లాగానే.. ఈ యుద్ధం ఎవరు ఆపారనే ప్రశ్నలు తొలుస్తున్నాయి. భారత్ -పాక్ కంటే ముందే ట్రంపే యుద్ధం ఆగిందని ఎలా చెప్పారు? కేంద్రం చెప్పదు. బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపారనే ప్రశ్నలాగే యుద్ధ విరమణ మిస్టరీ ఉందన్న చర్చలు ఉన్నాయి.**

**రచనలకు ఆహ్వానం**

ప్రతిరోజూ ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# ప్రపంచంలో అరుదైన బ్లడ్ గ్రూప్.. పేరు ఏంటో తెలుసా?

ప్రపంచంలోనే అత్యంత అరుదైన రక్త వర్గాన్ని కనుగొన్నారు. కర్ణాటకకు చెందిన 38 ఏళ్ల మహిళ శరీరంలో అరుదైన రక్త వర్గం ఉంది. ఇంతకు ముందు ఎప్పుడూ చూడని CRIB అనే కొత్త యాంటిజెన్ ఆ మహిళ రక్తంలో గుర్తించారు. ప్రపంచంలో ఒకే ఒక మహిళకు ఈ అరుదైన రక్త వర్గం ఉందని వైద్యులు చెప్పారు. కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన మహిళ శరీరంలో ఈ అరుదైన రక్త గ్రూపును గుర్తించారు. ఈ బ్లడ్ గ్రూప్ ఉన్న ప్రపంచంలోనే ఆమె ఏకైక మహిళగా నిలిచింది. ఈ మహిళకు రక్తం అవసరమైతే, ప్రపంచంలో ఎవరూ ఆమెకు రక్తం ఇవ్వలేరు. ఆమె తన రక్తాన్ని ముందుగానే దాచుకోవాలని వైద్యులు చెబుతున్నారు. వైద్య పరీక్షల్లో భాగంగా మహిళ రక్తాన్ని బెంగళూరులోని టీటీకే బ్లడ్ సెంటర్‌లోని అడ్వాన్స్‌డ్ ఇమ్యునో హెమటాలజీ రిఫరెన్స్ ల్యాబ్‌కు పరీక్షకు పంపించారు. వైద్యులు ఆమె రక్తాన్ని వేర్వేరు రక్త గ్రూపులతో పరీక్షించినప్పుడు, రక్తం చాలా వింతగా స్పందించింది. ఆమె రక్తంలో ఇంతకు ముందు ఎప్పుడూ చూడని ప్రత్యేకమైన యాంటిజెన్ ఉంది. ఆమె కుటుంబ సభ్యుల రక్త గ్రూపులను కూడా చెక్ చేశారు. అయితే ఎవరి రక్త గ్రూపు సరిపోలలేదని వైద్యులు వెల్లడించారు. 38 ఏళ్ల వయసు ఉండే ఆ మహిళ హార్ట్ సర్జరీ చేయించుకుంది. అయితే శస్త్రచికిత్సకు ముందు ఆమె రక్తం కోసం అందుబాటులో ఉన్న 20 దాతల యూనిట్లలో ఏవీ అనుకూలంగా లేవు. కుటుంబ సభ్యులతో కూడా కలవలేదు. ఆమె రక్త నమూనా చాలా వింతగా స్పందించింది. వైద్య పరిభాషలో దీనిని పాన్‌రియాక్టివ్ అంటారు. తరువాత 10 నెలల నిరంతర వైద్య పరిశోధన జరిగింది. అధికారికంగా CRIB అని పిలిచే కొత్త రక్త సమూహం కనుగొన్నారు. CRIB అంటే క్రోమర్ ఇండియా బెంగళూరు. ఈ నమూనాను యూకేలోని ఇంటర్నేషనల్ బ్లడ్ గ్రూప్ రిఫరెన్స్ లాబొరేటరీ (IBGRL)కి పంపారు. దాదాపు ఒక సంవత్సరం పాటు సమగ్ర విశ్లేషణ చేసిన తర్వాత, శాస్త్రవేత్తలు కోడ్‌ను ఛేదించారు. ఆ మహిళకు ఇంతకు ముందు ఎన్నడూ చూడని యాంటిజెన్ ఉంది. ఈ క్రోమర్ వ్యవస్థ కొత్త బ్లడ్ గ్రూప్‌లో భాగం. జూన్ 2025లో ఇటలీలోని మిలన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ 35వ కాంగ్రెస్‌లో కొత్త బ్లడ్ గ్రూప్ పేరును అధికారికంగా ప్రకటించారు.



టాప్ న్యూస్

## అడ్డుకుని తీరుతాం
- బనకచర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోం
- లోకేష్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దు
- కేంద్రంతో పొత్తు ఉందని అలా మాట్లాడుతావా?
- ఏపీ మంత్రికి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

04



## మంత్రి సురేఖకు బిగ్ షాక్
- క్రిమినల్ కేసు నమోదు చేయండి
- ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశం

04



## హైకమాండే ఫైనల్
- బీజేపీలో వ్యక్తిగత నిర్ణయాలుండవ్
- ఏదైనా.. వారే డిసైడ్ చేస్తారు.. శిరసావహిస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్

04



ANN తెలుగు

Follow: @ANNTELUGU

03-08-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 240 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## దేశంలో రాజకీయ మార్పులు?

భారత రాజకీయాలు ఒక సవాళ్లతో కూడిన దశలో ఉన్నాయి. రాహుల్ గాంధీ ఆరోపణలు, మోదీ నాయకత్వంపై ఒత్తిడి, మరియు అంతర్జాతీయ ఆర్థిక సవాళ్లు రాబోయే నెలల్లో రాజకీయ సంచలనాలకు, మార్పులకు కారణాలుగా మారే సూచనలున్నాయి. వాస్తవానికి భారత రాజకీయాలు 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఒక కీలకమైన మలుపు తీసుకున్నాయి. ఇపుడు రాహుల్ గాంధీ రిగ్గింగ్ ఆరోపణలు, బీజేపీపై దూకుడైన విమర్శలు, మరియు ఆర్థిక సవాళ్లు రాజకీయ వాతావరణాన్ని తీవ్రతరం చేశాయి. మోదీ నాయకత్వం ఎన్డీఏ భాగస్వాములపై ఆధారపడడంతో పాటు అటు దౌత్య సవాళ్ళు.. ఇటు ప్రతిపక్షాల సవాళ్ళు, 75ఏళ్ల నిబంధనపై పార్టీలోని కీలక నేతల ఆశలు కలగలసి దేశ రాజకీయాల్లో సరికొత్త మార్పులు జరగవచ్చన్న సంకేతాన్ని కలిగిస్తున్నాయి. దేశ రాజకీయాల్లో ఏదో జరగబోతుందన్న ఆసక్తిని కలిగిస్తున్నాయి. గతంలో ట్రంప్ తో ప్రధాని మోదీ చేసిన స్నేహం ఇపుడు ఆయన ప్రతిష్టపై ప్రభావం చూపుతోంది.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 2లో

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 99,930 |
| 22 క్యారెట్ | 91,600 |
| సిల్వర్ (కేజీ) | 1,16,000 |

# 15 సీట్లతో మోదీ ప్రధాని అయ్యారు

## 100 సీట్లలో రిగ్గింగ్ అక్రమాలు

2024 లోక్ సభ ఎన్నికలపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
ఎన్నికల కమిషన్ ఉనికిలో లేదని దేశం మొత్తానికి చాటిచెబుతాం
మావద్ద నూటికి నూరు శాతం రుజువులు ఉన్నాయి
నిప్పుతో చెలగాటం ఆడుతున్నామనే విషయం మాకు తెలుసు

*భారతదేశంలో ఎన్నికల వ్యవస్థ చచ్చిపోయింది. ఇది నిజం. 15 సీట్లతో మోదీ ప్రధాని అయ్యారు. ఆ 15 సీట్లు లేకుంటే మోదీకి ప్రధాని పదవి దక్కేది కాదు. ఎన్నికల కమిషన్ ఉనికిలో లేదని దేశం మొత్తానికి చాటిచెప్పేందుకు మావద్ద నూటికి నూరు శాతం రుజువులు ఉన్నాయి. ఈ ఆధారాల కోసం 6 నెలలు పని చేశాం. రాబోయే రోజుల్లో ఇవన్నీ బయటపెడతాం అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, 70 నుంచి100 స్థానాల్లో అక్రమాలు జరిగాయని అనుమానాలున్నాయన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ లీగల్ సెల్ నిర్వహించిన 'కాన్ స్టిట్యూషనల్ చాలెంజెస్ పర్‌స్పెక్టివ్ అండ్ పాత్ వేస్' అనే సదస్సులో రాహుల్ ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎలా రిగ్గింగ్ జరుగుతుందో రాబోయే రోజుల్లో నిరూపిస్తామన్నారు.* - మహా, ఢిల్లీ

### నేను రాజును కావాలనుకోవడం లేదు

తాను దేశానికి రాజు కావాలని అస్సలు అనుకోవడం లేదని, అలాంటి భావనకు తాను పూర్తి వ్యతిరేకినని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని మొదలుపెట్టగానే, 'ఇస్ దేశ్ కా రాజా కైసా హో, రాహుల్ గాంధీ జైసా హో' అంటూ పలువురు సభికులు నినాదాలు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ, "లేదండి, నేను రాజును కాదు. రాజు కావాలని నాకు లేదు. నేను రాజుకు వ్యతిరేకిని. రాజు అనే భావనను కూడా నేను వ్యతిరేకిస్తాను" అని తేల్చి చెప్పారు. గతంలో 'రాజు' అనే పదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశ ప్రజల అభిప్రాయాన్ని, మనోభావాలను మోదీ ఆలకించడం లేదని ఆనాడు కాంగ్రెస్ అగ్రనేత ధ్వజమెత్తారు.

04





పాతాళంలో దాక్కున్నా
## వదలం
- పాక్‌కు ప్రధాని మోదీ తీవ్ర హెచ్చరిక
- అవసరమైతే భారత్ కాళభైరవుడిలా మారుతుందని స్పష్టీకరణ

వివరాలు 4లో



# ఏజ్ లిమిట్ మోదీకి వర్తించదా?

**మోదీని దించుతాం.. రాహుల్‌ను ప్రధానిని చేసి తీరుతాం**
**ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఢిల్లీ, మహా :** తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సు జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గతంలో దేశానికి ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చిన రాహుల్ గాంధీ వదులుకున్నారని.. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. 75 ఏళ్లకు పదవి నుంచి దిగిపోవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చెబుతున్నారని.. కానీ ప్రధాని సీటు వదులుకోవడానికి మోదీ ముందుకు రావడం లేదన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగం ప్రకారం గతంలో ఎల్‌కే అద్వానీ, మురళి మనోహర్ జోషికి వర్తించినా ఏజ్ లిమిట్ సూత్రం.. మోదీకి వర్తించదా అని ప్రశ్నించారు.

మిగతా 2లో

## చెప్పు తెగుద్ది..
అనసూయ వార్నింగ్
వీడియో వైరల్

04



**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 81,463.09 |
| నిఫ్టీ ↗ | 24,837 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 4.25 | 127.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 4.8 | 127.5 |
| రిటైల్ గుడ్డు ధర | 4.51 | 135.15 |

## బీసీలకు అండగా ఉంటాం
**రాహుల్, రేవంత్ మాయలో పడొద్దు**
- కులగణన చేయలేదు.. ఇద్దరూ ముక్కు నేలకు రాయాలి
- బీసీల రిజర్వేషన్ల పెంచట్లేదు.. ముస్లింలకు మేలు చేస్తున్నరు
- ఇందిరా పార్క్ బీజేపీ ధర్నాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మహా: రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని చూస్తున్నారని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని..

మిగతా 4లో



## హస్తిన యాత్రల్లో సీఎం హాఫ్ సెంచరీ
- 50 సార్లు ఢిల్లీ వెళ్లినా నయాపైసా లాభం లేదు
- రాష్ట్రానికి పాలించే సీఎం కావాలె.. ఢిల్లీ యాత్ర చేసే టూరిస్టు కాదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 4లో



## కాళేశ్వరం దోషి కేసీఆరే
**ప్రభుత్వ సొమ్ము తిన్నవాళ్లను తిరిగి కక్కిస్తాం**
- ఈ కారు రేస్‌లో కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా?
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- ఆర్మూరులో జోరుగా జనహిత యాత్ర.. నేడు ఖానాపూర్ లో ఫైనల్

04



## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు
**కార్పొరేట్ స్థాయిలో నిర్మాణాలు**

నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాలు
త్వరలో గచ్చిబౌలిలో భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు
రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మహా :** ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించడం (రీఆర్గనైజేషన్)తో పాటు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రెవెన్యూ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్ ల నిర్మాణం ఉండాలని సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.



మిగతా 4లో

## అడ్డుకుని తీరుతాం

### ఏపీ మంత్రికి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్, మహా:** బనకచర్లపై ఏపీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలు సరైనవి కావని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును తమ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని వ్యాఖ్యానించారు. లోకేష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని చెప్పారు. పోలవరం బనకచర్లకు పర్యావరణ అనుమతి లేదని, జీఆర్ఎంబీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. శనివారం తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తానే స్వయంగా తన లెటర్ హెడ్‌పై కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశానని స్పష్టం చేశారు. బనకచర్లను ఆపేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పుకొచ్చారు. బనకచర్లపై తమ స్టాండ్ క్లియర్‌గా ఉందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, గులాబీ నేతలు పబ్లిసిటీ కోసం మాత్రమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. బీఆర్ఎస్ గాలి మాటలు తప్ప వాస్తవం లేదని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుకు తాము వ్యతిరేకమని.. ఎంతటి పోరాటానికి అయినా తాము సిద్ధమని ఉద్ఘాటించారు. కేంద్ర బీజేపీతో టీడీపీ పొత్తు ఉందని మంత్రి నారా లోకేష్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పోలవరం బనకచర్ల ఇల్లీగల్ ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

## 15 సీట్లతో మోదీ ప్రధాని అయ్యారు

**ఢిల్లీ, మహా :**



భారతదేశంలో ఎన్నికల వ్యవస్థ చచ్చిపోయింది. ఇది నిజం. 15 సీట్లతో మోదీ ప్రధాని అయ్యారు. ఆ 15 సీట్లు లేకుంటే మోదీకి ప్రధాని పదవి దక్కేది కాదు. ఎన్నికల కమిషన్ ఉనికిలో లేదని దేశం మొత్తానికి చాటిచెప్పేందుకు మావద్ద నూటికి నూరు శాతం రుజువులు ఉన్నాయి. ఈ ఆధారాల కోసం 6 నెలలు పని చేశాం. రాబోయే రోజుల్లో ఇవన్నీ బయటపెడతాం అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, 70 నుంచి 100 స్థానాల్లో అక్రమాలు జరిగాయని అనుమానాలున్నాయన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కాంగ్రెస్ లీగల్ సెల్ నిర్వహించిన 'కాన్ స్టిట్యూషనల్ చాలెంజెస్ పర్‌స్పెక్టివ్ అండ్ పాత్ వేస్' అనే సదస్సులో రాహుల్ ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎలా రిగ్గింగ్ జరుగుతుందో రాబోయే రోజుల్లో నిరూపిస్తామన్నారు. 2014కి ముందు నుంచి ఏదో తప్పు జరుగుతుందనే అనుమానాలున్నాయని, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలపైనా తనకు సందేహాలున్నాయని తెలిపారు. కానీ దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించలేకపోయామన్నారు. అయితే ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించి కాంగ్రెస్ వద్ద ప్రస్తుతం 100 శాతం రుజువు ఉందని, అది బయట పెడితే అణుబాంబు వేసినట్టే అవుతుందన్నారు. ఎన్నికల కమిషన్ ఉనికిలో లేకుండా పోయే ఆధారాలు తమ వద్ద ఉన్నాయని నొక్కి చెప్పారు. మోదీ చాలా తక్కువ మెజారిటీతో భారత ప్రధాని అయ్యారని, 10 నుంచి 15 సీట్లలో రిగ్గింగ్ జరగకపోతే ఆయన ప్రధాని అయ్యేవారే కాదని విమర్శించారు. ఎన్నికల కమిషన్ లాంటి సంస్థ ఉనికిలో లేదని దేశమంతటికీ చూపించే ఆధారాలు మా వద్ద ఉన్నాయని, వీటిని కనుగొనడానికి మాకు 6 నెలల సమయం పట్టిందన్నారు. వాటన్నింటినీ త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. 6.5 లక్షల మంది ఓటేస్తే, వారిలో 1.5 లక్షల మంది నకిలీ ఓటర్లేనని తెలిపారు. 'మహారాష్ట్రలో లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఎక్కువ సీట్లు గెలిచింది. కానీ ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ పోల్స్‌లో ఓడిపోయాం. బలమైన మూడు పార్టీలు తుడిచిపెట్టుకు పోయాయి. అప్పటి నుంచి ఎన్నికల దుర్వినియోగంపై పరిశోధించాం. లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య మహారాష్ట్రలో కోటిమంది కొత్త ఓటర్లు చేరారు. దీనికి సంబంధించిన ఎవిడెన్స్ తమ వద్ద ఉంది' అని వ్యాఖ్యానించారు.

**ఆ సమాచారం ఆటం బాంబులా కుదిపేస్తుంది**

కర్ణాటక రాష్ట్రంలోని ఒక అసెంబ్లీ స్థానంలో ఉన్న ఓటర్ల ఫొటోలు, పేర్లను తమ పార్టీ తనిఖీ చేయగా, మొత్తం 6.5 లక్షల ఓటర్లలోని 1.5 లక్షల మంది ఓటర్లు నకిలీలే అని తేలిందని రాహుల్ చెప్పారు. ఈ సమాచారాన్ని కాంగ్రెస్ విడుదల చేశాక ఎన్నికల వ్యవస్థలో ప్రకంపనలు రావడాన్ని అందరూ చూస్తారని, అది ఆటం బాంబులా కుదిపేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కొందరి హస్తాల్లోకి వెళ్లిపోయిందని, దాని ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆరోపించారు. ఇంతకుముందు తగిన సాక్ష్యాధారాలు లేక ఈ అంశంపై తాను మాట్లాడలేకపోయేవాడినని తెలిపారు. ఇప్పుడు తమ చేతిలో 100 శాతం సాక్ష్యాలు ఉండబట్టే, ఇలా మాట్లాడగలుగుతున్నానని రాహుల్ చెప్పారు.

**నేను రాజును కావాలనుకోవడం లేదు**

తాను దేశానికి రాజు కావాలని అస్సలు అనుకోవడం లేదని, అలాంటి భావనకు తాను పూర్తి వ్యతిరేకినని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని మొదలుపెట్టగానే, 'ఇస్ దేశ్ కా రాజా కైసా హో, రాహుల్ గాంధీ జైసా హో' అంటూ పలువురు సభికులు నినాదాలు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ, "లేదండి, నేను రాజును కాదు. రాజు కావాలని నాకు లేదు. నేను రాజుకు వ్యతిరేకిని. రాజు అనే భావనను కూడా నేను వ్యతిరేకిస్తాను" అని తేల్చి చెప్పారు. గతంలో 'రాజు' అనే పదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశ ప్రజల అభిప్రాయాన్ని, మనోభావాలను మోదీ ఆలకించడం లేదని ఆనాడు కాంగ్రెస్ అగ్రనేత ధ్వజమెత్తారు.

**అణుబాంబు వెంటనే పేల్చాలి: రాజ్ నాథ్ సింగ్**

రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా తమ వద్ద ఆధారాలుంటే వెంటనే అణుబాంబు పేల్చాలని సవాల్ విసిరారు. రాహుల్ వద్ద ఆధారాలుంటే వెంటనే బయటపెట్టాలని తెలిపారు. లేదంటే ఎటువంటి ఎవిడెన్స్ లేనట్టేనని స్పష్టం చేశారు.

## హైకమాండే ఫైనల్

- బీజేపీలో వ్యక్తిగత నిర్ణయాలుండవ్
- ఏదైనా.. వారే డిసైడ్ చేస్తారు.. శిరసావహిస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, మహా :** భారతీయ జనతా పార్టీలో వ్యక్తిగత నిర్ణయాలు ఉండబోవని, ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలనేది పార్టీ నాయకత్వమే నిర్ణయిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. "మాకు ఈ పదవి కావాలి? ఆ పదవి కావాలంటూ సొంత నిర్ణయాలను ఎన్నడూ పార్టీ నాయకత్వంపై రుద్దబోం. ఎందుకంటే బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ. నాయకత్వం ఏది చెబితే అది శిరసావహించి పనిచేస్తాం. పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలను అమలు చేయడమే కార్యకర్తలుగా, నాయకులుగా మా బాధ్యత" అని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో కిసాన్ సమ్మాన్ నిధి, సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై వెళుతుండగా ఓ పత్రికలో తనను మంత్రి పదవి నుండి విముక్తి చేయాలంటూ వస్తున్న వార్తలపై మీడియా అడిగిన ప్రశ్నకు పైవిధంగా బదులిచ్చారు. పార్టీ ఏది చెబితే అది చేస్తా, దయచేసి ఇలాంటి తప్పుడు వార్తలు రాయొద్దని కోరుతున్నానని అన్నారు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ను చూసి బీజేపీ కూడా అట్లనే అని భావిస్తున్నారమో... అట్లా కాదన్నారు. బీజేపీలో సమష్టి నిర్ణయాలుంటాయి. వాటిని అమలు చేసే బాధ్యత కార్యకర్తలుగా మాపై ఉంటుంది. కమిట్‌మెంట్ కలిగిన నాయకుడిగా భావిస్తామన్నారు.

## బీసీలకు అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. శనివారం ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ధర్నా నిర్వహించింది. బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బీజేపీ నేతలు ఎండగట్టారు. బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు , బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించారని ఆరోపించారు. గతంలో అమలైన 35 శాతం కంటే కూడా రెండు శాతం రిజర్వేషన్లు తగ్గించేలా కాంగ్రెస్ కుట్ర చేస్తుందని ఆక్షేపించారు. 20 శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు.

**బీసీ సంఘాలు పోరాటం చేయాలి..**

ఎస్సీ, ఎస్టీలో జనాభా పెరిగిందని బీసీల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. 42 శాతం పూర్తిగా బీసీలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. బీసీల మెడలు కోసేలా ముస్లింలకు రిజర్వేషన్‌లు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం చేసిన పార్టీ బీజేపీ మాత్రమేనని ఉద్ఘాటించారు. గత 70 ఏళ్లలో కుల గణన ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కులగణన చేయని కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ పార్లమెంట్ ముందు ముక్కు నేలకు రాయాలని విమర్శించారు కిషన్‌రెడ్డి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ విషయంలో మార్పు వచ్చిందో సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి నిలదీశారు. రాష్ట్రంలో ముస్లింలకు అమలవుతున్న 4శాతం రిజర్వేషన్‌లు తొలగించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కింద ముస్లిం, క్రిస్టియన్‌లకు రిజర్వేషన్‌లు కల్పిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ విషయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ ఏ విషయంలో ఆదర్శమో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాయలో మనం పడకూడదని సూచించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అన్ని బీసీ సంఘాలు పోరాటం చేయాలని కోరారు.

## ఏజ్ లిమిట్ మోదీకి వర్తించదా?

### మోదీని దించుతాం.. రాహుల్‌ను ప్రధానిని చేసి తీరుతాం

### ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

మోడీని ప్రధాని గద్దె మీద నుంచి కిందకు దించడం ఒక్క రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. మోదీని తరిమికొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు. "కాంగ్రెస్ దేశానికి ఏం చేసిందని బీజేపీ అడుగుతోంది. దేశం నుంచి బ్రిటిష్ పాలకులను తరిమికొట్టి స్వాతంత్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే. దేశానికి రాజ్యాంగాన్ని అందించింది కాంగ్రెస్ పార్టీనే. సామాజిక న్యాయం కోసం పని చేస్తోన్న పార్టీ కాంగ్రెస్. బీజేపీ సహా అన్ని పార్టీలు అధికారం లేకపోతే ఇంటికే పరిమితమవుతాయి.. కానీ అధికారం ఉన్నా లేకపోయిన కాంగ్రెస్ ప్రజల పక్షాన కొట్లాడుతోంది. మాది ఎప్పటికీ ప్రజల పక్షమే. దేశం కోసం గాంధీ కుటుంబ ఎన్నో త్యాగాలు చేసింది" అని సీఎం రేవంత్ హాట్ కామెంట్స్ చేశారు. తమది ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు. పాకిస్థాన్ ను ఇందిరా గాంధీ రెండు ముక్కలు చేశారు. తీవ్రవాదంపై పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ప్రధాని పదవిని త్యాగం చేసిన ఘనత సోనియా గాంధీదని.. అలాగే రాహుల్ భారత ప్రధాని కావాలనుకుంటే ఎప్పుడో అయ్యేవారన్నారు. దేశం కోసం పదవులు త్యాగం చేసిన ఘనత గాంధీ కుటుంబానిదని అన్నారు.

## చెప్పు తెగుద్ది.. అనసూయ వార్నింగ్ వీడియో వైరల్

**మహా :** సినీ నటి, యాంకర్ అనసూయ తాజాగా ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఓ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అక్కడ తనపై కొందరు యువకులు అసభ్య కామెంట్లు చేయడంతో 'చెప్పు తెగుద్ది' అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. వివరాలలోకి వెళితే, ఈ కార్యక్రమంలో అనసూయ మాట్లాడుతున్న సమయంలో అక్కడికి వచ్చిన కొందరు ఆకతాయిలు కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. 'చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబ సభ్యులను ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా? వెరీ బ్యాడ్' అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన తాలూకు వీడియో బయటకు రావడంతో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవన్నీ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశల వారీగా నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకే చోట ఇంటిగ్రేటెడ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14కు గాను మూడు చోట్ల, మేడ్చల్ జిల్లాలో 12కు గాను మూడు చోట్ల, సంగారెడ్డి, పఠాన్‌చెరువు కలిపి ఒకటి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇంటి గ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పని తీరు మెరుగుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుందని అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పని భారం సమానంగా ఉండడంతో పాటు దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందన్నారు. మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఒక రోల్ మోడల్‌గా ఉంటుందన్నారు. సీఎంతో చర్చించి ఈ బిల్డింగ్ నమూనాకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరితగతిన ఈ భవనానికి శంకుస్థాపన చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

**కేంద్రం సహకరించకున్నా..ఇందిరమ్మ ఇండ్లు ఆగవు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉన్నాకూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడలేదని, కేంద్రం అనేక నిబంధనలతో కొర్రీలు వేస్తోందన్నారు. ఒక్కో ఇంటికి గ్రామీణ ప్రాంతాల్లో రూ. 72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.52 లక్షలు కేంద్రం ఇస్తుందని కానీ రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షలు ఇస్తుందని తెలిపారు. కేంద్రం నుంచి అరకొర సహాయంపై ఆధారపడకుండానే రాష్ట్రంలో అనుకున్న ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు. కేంద్రం సూచించిన విధంగా రీసర్వే కూడా చేపట్టామని ఇది తుది దశలో ఉందన్నారు. వాస్తవానికి లబ్దిదారుల ఎంపికలో కేంద్ర నిబంధనల కంటే రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలే పకడ్బందీగా ఉన్నాయన్నారు. ఇండ్ల నిర్మాణ పనులు కూడా ఆశించిన స్థాయిలో పురోగతిలో ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక దశ దిశ లేకుండా గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించిందని వీటిలో చాలా వరకు అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్నాయని కనీస వసతులు కూడా లేవని అన్నారు. వీటన్నింటికీ అవసరమైన మరమ్మతులు చేపట్టి లబ్దిదారులకు కేటాయించబోతున్నామని తెలిపారు. భూభారతికి సంబంధించి వచ్చిన దరఖాస్తుల్లో ప్రధానంగా సాదాబైనామాలకు సంబంధించినవే ఉన్నాయని ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పురాగానే పరిష్కరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచామన్నారు.

## కాళేశ్వరం దోషి కేసీఆరే



**సంగారెడ్డి, ఆర్మూరు మహా:** మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం అబద్ధాల పుట్టని, కాళేశ్వరం కుంభకోణంలో కేసీఆరే దోషి అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. శనివారం ఆందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఆర్మూరుకు యాత్ర చేరుకోగా, వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు ఘనస్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం నిర్మల్ జిల్లా ఖానాపూర్ కు యాత్ర చేరుకోనుంది. ఆర్మూరులో ఇన్ ఛార్జి మంత్రి సీతక్క యాత్రలో పాల్గొన్నారు.

**పిల్లర్లు కుంగడం సామాన్య విషయమా?**

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు. ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్లు కక్కక తప్పదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్న నియోజకవర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయని, ప్రతిపక్షాల కుట్రల వల్ల వేరే పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని తెలియజేశారు.

## మంత్రి సురేఖకు బిగ్ షాక్

### క్రిమినల్ కేసు నమోదు చేయండి.. ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశం



**హైదరాబాద్, మహా :** మంత్రి కొండా సురేఖకు బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21వ తేదీ లోపు నిందితురాలిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ వ్యవహారాలు, నటి సమంత విడాకుల వివాదం వంటి అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ నిరాధార ఆరోపణలు చేశారని కేటీఆర్ తరపు న్యాయవాదులు కోర్టుకు నివేదించారు. ఈ ఆరోపణలు తన ప్రతిష్టకు భంగం కలిగించాయని పేర్కొంటూ కేటీఆర్ పరువు నష్టం దావాను దాఖలు చేశారు. కేటీఆర్ దాఖలు చేసిన ఈ పరువు నష్టం దావాను బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) సెక్షన్ 356 కింద పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించింది.

కేసు విచారణ సందర్భంగా కొండా సురేఖ న్యాయవాది అభ్యంతరాలను కోర్టు తిరస్కరించింది. మంత్రి కొండా సురేఖ తరపు న్యాయవాది కోర్టులో కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసిన ఫిర్యాదు ఊహాగానాల ఆధారంగా ఉందని, సరైన సమాచారం లేదని, అలాగే ఫిర్యాదు చేసిన పోలీస్ స్టేషన్ పరిధి వంటి అంశాలపై అభ్యంతరాలు లేవనెత్తారు. అయితే, కొండా సురేఖ న్యాయవాది వ్యక్తం చేసిన ఈ అభ్యంతరాలను నాంపల్లి కోర్టు తోసిపుచ్చింది. ఇదే సమయంలో కేటీఆర్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ పోగుల వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. కొండా సురేఖ చేసిన ఆరోపణలు నిరాధారంగా ఉన్నాయని కేటీఆర్ తరపు న్యాయవాది బలంగా వాదించారు. ఈ వాదనతో ఏకీభవించిన కోర్టు, నిందితురాలిపై క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చని తీర్పునిచ్చింది. ఈ ఆదేశాలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. కొండా సురేఖ వ్యాఖ్యలు గతంలోనే రాష్ట్ర రాజకీయాలలో దుమారం రేపాయి. తాజా పరిణామాలతో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఉత్కంఠగా మారింది.

## పాతాళంలో దాక్కున్నా వదలం

- పాక్‌కు ప్రధాని మోదీ తీవ్ర హెచ్చరిక
- అవసరమైతే భారత్ కాళభైరవుడిలా మారుతుందని స్పష్టీకరణ



**వారణాసి, మహా:** భారత్‌పై దాడి చేసే ఉగ్రవాదులు పాతాళ లోకంలో దాక్కున్నా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాదాన్ని, అన్యాయాన్ని అణచివేసేందుకు అవసరమైతే భారత్ 'కాళభైరవుడి' రూపం దాలుస్తుందని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ప్రపంచం భారతదేశ రుద్ర రూపాన్ని చూసిందని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో ఏర్పాటు చేసిన భారీ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని గుర్తుచేసుకుంటూ, ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రతీకారం తీర్చుకుంటానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని తెలిపారు. మహాదేవుని ఆశీస్సులతో 'ఆపరేషన్ సిందూర్' విజయం సాధించిందని, ఈ విజయాన్ని కాశీ విశ్వనాథుని పాదాల చెంత సమర్పిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా విపక్షాలపై ప్రధాని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని దేశంలోని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేయడం చూసి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు కన్నీళ్లు పెట్టుకుంటున్నాయి. మన సైనికుల విజయాన్ని వారు ఓర్వలేకపోతున్నారు" అని ఆరోపించారు. ఉగ్రవాదులను ఏరివేయడానికి ఫలానా రోజు ఎందుకు ఎంచుకున్నారని ప్రశ్నించడం మన సైన్యాన్ని, అమరవీరులను అవమానించడమేనని మోదీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో 'మేడ్ ఇన్ ఇండియా' ఆయుధాల శక్తిని ప్రపంచం చూసిందని మోదీ అన్నారు. ముఖ్యంగా బ్రహ్మోస్ క్షిపణుల కారణంగా పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని తెలిపారు. త్వరలో ఈ క్షిపణులను ఉత్తరప్రదేశ్‌లోనే తయారు చేయనున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో పాకిస్థాన్ మరోసారి దుస్సాహసానికి పాల్పడితే, యూపీలో తయారైన క్షిపణులే ఉగ్ర స్థావరాలకు సమాధానం చెబుతాయని హెచ్చరించారు. ఇది కొత్త భారత్ అని, మహాదేవుణ్ణి పూజించే ఈ దేశం, అవసరమైనప్పుడు కాళభైరవుడిగా మారడానికి వెనుకాడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## హస్తిన యాత్రల్లో సీఎం హాఫ్ సెంచరీ

- 50 సార్లు ఢిల్లీ వెళ్లినా నయాపైసా లాభం లేదు
- రాష్ట్రానికి పాలించే సీఎం కావాలె.. ఢిల్లీ యాత్ర చేసే టూరిస్టు కాదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా:** హస్తిన యాత్రల్లో సీఎం రేవంత్ రెడ్డి అర్ధశతకం సాధించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 50 సార్లు ఢిల్లీకి వెళ్లి తెలంగాణకు నయాపైసా లాభం కూడా చేయలేదన్నారు. ఢిల్లీ వెళ్లి ఏం సాధించారో చెప్పే దమ్ము రేవంత్ రెడ్డి ఉందా? అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా.. ఫ్లైట్ బుకింగ్స్‌తో నడిపిస్తున్నారని కామెంట్స్ చేశారు. రాహుల్ గాంధీ, నరేంద్ర మోడీ, చంద్రబాబుల ముద్దుల బానిసగా తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ తాకట్టు పెట్టిండని వ్యాఖ్యానించారు. పాలించే ముఖ్యమంత్రి కావాలి కానీ, ఢిల్లీకి విహార యాత్రలు చేసే టూరిస్ట్ సీఎం అవసరం లేదన్నారు. ముగ్గురు యజమానుల ముద్దుల బానిస అయిన రేవంత్ రెడ్డి తన మొదటి బాస్ రాహుల్ గాంధీకి నోట్ల కట్టల మూటలు మోస్తూ పదవిని కాపాడుకుంటున్నారని తెలిపారు. రెండో యజమాని మోడీకి సన్నిహితులైన వ్యాపారవేత్తలకు తెలంగాణ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి కేసుల నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఇక మన అన్నదాతల కడుపు కొట్టి తెలంగాణ జల సంపదను తన మూడో యజమాని చంద్రబాబుకు దోచిపెడుతున్నారన్నారు. తెలంగాణ సోయిలేని రేవంత్ రెడ్డి బానిస మనస్తత్వంతో త్యాగాల పునాదులపై పురుడు పోసుకున్న తెలంగాణ నిలువు దోపిడికి గురవుతుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

**యూరియా దొరక్క అన్నదాతలు అరిగోస..**

ఢిల్లీ యాత్రలతో రాష్ట్రానికి సాధించింది ఏమిటో దమ్ముంటే రేవంత్ రెడ్డి శ్వేత పత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 50 సార్లు ఢిల్లీ బాసుల గుమ్మం తొక్కిన రేవంత్ రెడ్డి, ఒక్క కొత్త ప్రాజెక్టుకు అనుమతులు కాని, అదనంగా కేంద్రం నుంచి నిధులు తేవడం లేదంటే రాష్ట్రం కోసం ఓ ప్యాకేజీ అయినా సాధించారా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవడంతో సాగునీళ్లు రాక రైతన్నలు ఇబ్బందులు పడుతుంటే సీఎంకు సోయి లేదన్నారు. పండించిన పంటలకు మార్కెట్లో మద్దతు ధర లేక, పొలాల్లో చల్లడానికి యూరియా దొరక్క అన్నదాతలు అరిగోస పడుతుంటే రేవంత్ మాత్రం ఫోటో షూట్లు, వీడియోలు, విందు రాజకీయాలతో జల్సాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాల ఊసు లేదు. జాబ్ క్యాలెండర్ల జాడ లేదు. రుణమాఫీ కాలేదు. రైతు భరోసా రాలేదు. తులం బంగారం ఊసు లేదు. రూ.4 వేల ఫించన్ జాడ లేదు. గురుకులాల గోడు పట్టదు. గురుకుల విద్యార్థుల ఆకలి కేకలు ఆగడం లేదు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం 3 రోజుల్లో 3 ఫ్లైట్‌లు ఎక్కుతున్నడు, దిగుతున్నడని కేటీఆర్ విమర్శించారు. 50 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టిన రేవంత్ రెడ్డి, తెలంగాణకు తెచ్చింది ఏమీ లేదు.. శుష్కప్రియాలు..శూన్య హస్తాలే అని కేటీఆర్ అన్నారు

# కోకాపేట్ జేష్ఠ విల్లాస్‌లో ఉద్రిక్తతలు..

## అద్దె దారులపై సొసైటీ సభ్యుల దౌర్జన్యాలు



**రాజేంద్రనగర్, మహా ;** నార్సింగీ మున్సిపల్ పరిధిలోని కోకాపేట్ లోని జేష్ఠ విల్లాస్ లో శనివారం తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. విల్లాస్ లో అద్దెకు ఉంటున్న వారిపై సొసైటీ సభ్యులు దౌర్జన్యానికి పాల్పడ్డారు, ఈ క్రమంలోనే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బిల్డర్స్ కి, ల్యాండ్ ఓనర్స్ కి మధ్య ఉన్న పంచాయతీని అద్దెదారులపై రుద్ది ఇబ్బంది పెట్టడం సొసైటీ సభ్యుల కు తగదన్నారు. విల్లాస్ లో అద్దెకు ఉంటున్న వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె దారులను విల్లాలోకి అనుమతించకుండా గేటు వద్ద ప్రైవేటు బౌన్స్ ర్లతో తమను బెదిరిస్తున్నారని బాధితులు గేటు ముందు ఆందోళన చేశారు. ఈ క్రమంలో అద్దెదారులకు సొసైటీ సభ్యులకు మధ్య వాగ్వాదం జరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జేష్ఠ విల్లాస్ లో అద్దెకుంటున్న దేశ్ కాంత్ రెడ్డి తన ఇంటికి తరచూ కరెంటు కట్ చేయడం, పని మనుషులను గేట్ వద్ద అడ్డుకోవడం జరిగిందని సొసైటీ సభ్యులను ప్రశ్నించారు. సందర్భంగా సొసైటీ సభ్యుడు విక్రాంత్, దేశ్ కాంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించి దాడికి యత్నించినట్లు ఆరోపించాడు. విల్లాస్ లో కమర్షియల్ మీటర్లు ఉండవలసిన చోట రెసిడెన్షియల్ మీటర్లు పెట్టి పెద్ద ఎత్తున విద్యుత్ చోరీకి పాల్పడుతున్నారు, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని ఆరోపించారు. సొసైటీ సభ్యులకు బిల్డర్ కి విల్లా ఓనర్లకు సమస్య ఉంటే మీరు మాట్లాడుకోవాలి. అద్దె దారులపై జులుమ్ చెలాయించి దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఇరువురు నార్సింగీ పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** గత జూలై మాసం 25 నుండి 27 వరకు హైదరాబాద్ లోని షేక్ పేటలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో మంచిర్యాల జిల్లా క్రీడాకారుల ప్రతిభ సాతారని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ రాజేష్ లతో కలిసి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో ఖేలో ఇండియా బాక్సింగ్ క్రీడాకారులు బి అనురాగ్ (బంగారు పతకం), ఎం అశ్వద్ (వెండి పతకం), బి రుత్విక్ కుమార్, జి శ్రీనాథ్ లు (కాంస్య) పతకాలు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆయన కీర్తించారు. ఈ నెల 6 నుండి 15 వరకు ఉత్తర ప్రదేశ్ లోని నోయిడా లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన బి అనురాగ్, రాష్ట్ర టీమ్ కోచ్ గా ఎంపికైన ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ సిహెచ్ రాజేష్ లు జాతీయస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఒకే ఇంటి నెంబర్ పై రెండు ఇళ్ల నిర్మాణాల కథనానికి స్పందన

## రమణమ్మ ఇంటి పత్రాలను పరిశీలించిన రెవెన్యూ ఇన్స్పెక్టర్

### ప్రజా వినతులను పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు





**వరంగల్ మహా;** ఒకే ఇంటి నెంబర్ పై రెండవ ఇల్లు నిర్మాణం కథనానకి బల్దియా అధికారుల నుంచి ఒక వైపు స్పందన లభించింది. బల్దియా పరిధిలోని 42వ డివిజన్ రంగశాయి పేట్ పద్మశాలి వీధి లోని యజమాని వనం రమణమ్మ ఇంటి నిర్మాణానికి 19421/ఎ గల నెంబర్ పై బల్దియా అధికారులు అదే వీధిలోని పై తెలిపిన ఇంటి నెంబర్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ధరణ రాణి అనే ఆమె కు ఇదే నెంబర్ పై ఓ ఇంటి నిర్మాణం జరిగిందనే విషయం పై మహా పత్రికలో కథనం ప్రచురతమైంది. ఈ కథనానికి స్పందించిన బల్దియా రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమణమ్మ ఇంటికి వెళ్లి వారి ఇంటి పత్రాలను పరిశీలించారు. పరిశీలించిన ఆయన రమణమ్మ ఇంటి నెంబరు పత్రాలు సరిగ్గానే ఉన్నాయని నిర్ధారించి ఇదే ఇంటి నెంబర్ పై నిర్మించిన ధరణ రాణి ఇంటి నెంబర్ ను తొలగిస్తామని రమణమ్మకు తెలిపారు. ముఖ్యంగా ధరణ రాణి నిర్మించిన ఇంటికి ఎటువంటి అనుమతులు లేవని ఈ అక్రమ నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు సహకరించారని, ఫోన్ చేసిన బల్దియా సంభందిత అధికారులు స్పందించరని అంతేకాకుండా నగరంలో జరిగిన జరుగుతున్న అక్రమ నిర్మాణాల వెనుక టౌన్ ప్లానింగ్ అధికారులు సహాయ సహకారాలు ఉన్నాయని రమణమ్మ కుమారుడు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాల పై పలువురు బాధితులు ఎన్నిసార్లు బల్దియా లో సోమవారం జరిగే ప్రజావాణిలో కమిషనర్ ను కలిసి అధికారులకు ఫిర్యాదులు అందించినప్పటికీ ఎటువంటి ఫలితం ఉండటం లేదని నగర ప్రజలు అంటున్న మాట.. ఇప్పటికైనా కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఇన్చార్జి సిపి రవీంద్ర రడెకర్ స్పందించి ఈ అక్రమ నిర్మాణాల పై ఉక్కుపాదం మోపుతారా? అడ్డగోలుగా అనుమతులిచ్చే అధికారులను గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా? ప్రజా వినతులను పట్టించుకోని అధికారుల తీరుపై చర్యలు తీసుకుంటారా లేదా ? వేచి చూడాల్సిందే..!

# నగరంలోని జంక్షన్‌లను సుందరంగా తీర్చిదిద్దాలి

## నగర మేయర్ గుండు సుధారాణి.. కమిషనర్ తో కలిసి జంక్షన్ లు, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ పరిశీలనలు



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని జంక్షన్ లను సుందరం గా తీర్చిదిద్దాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి జంక్షన్ ల స్థితి గతులు శానిటేషన్ తో పాటు టౌన్ ప్లానింగ్ సంబంధిత అంశాలను క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భం గా బల్దియా ప్రధాన కార్యాలయం ముందు, జెమినీ టాకీస్ జంక్షన్, పోతన రోడ్ లో గల జెండా ప్రాంతం ముందు, రామన్నపేట స్థూపం వద్ద, బి ఆర్ నగర్ ప్రాంతం లో, ఉర్సు జంక్షన్, ఉర్సు బండ్ వినాయక నిమజ్జన ప్రాంతం, నాయుడు పెట్రోల్ పంపు జంక్షన్ మెట్టుగుట్ట జంక్షన్ ఫాతిమా జంక్షన్, రెడ్ క్రాస్ భవన్ వద్ద గల హనుమాన్ ఆలయం, హన్మకొండ కలెక్టర్ నివాస భవనం ముందు, కాళోజీ జంక్షన్ ములుగు రోడ్ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో లో జంక్షన్ ల స్థితి గతులు శానిటేషన్ టౌన్ ప్లానింగ్ సంబంధిత అంశాలను పరిశీలించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ జెమినీ టాకీస్ జంక్షన్ ను విస్తరించి అభివృద్ధి చేయాలని పోతన నగర్ జంక్షన్ ప్రాంతం లో కల్వర్టు నిర్మించి గ్రీనరీ ఏర్పాటు చేసేలా చూడాలని ఉర్సు గుట్ట ప్రాంతంలోని జంక్షన్ వద్ద పక్షుల బొమ్మలకు పెయింటింగ్స్ వేయించి సుందరంగా తీర్చిదిద్దాలని ఉర్సు గుట్ట ప్రాంతం నుండి నాయుడు పెట్రోల్ పంపు వరకు డివైడర్ల మధ్యలో మొక్కలు నాటించాలని మెట్టుగుట్ట ప్రాంతంలో ప్రధాన రహదారి పై గల జంక్షన్ ను అభివృద్ధి చేయాలని ఇదే ప్రాంతంలో స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన మేయర్ డ్రైనేజీ లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్ ప్రాంతంలో గల జంక్షన్ ను విస్తరించాలని, ఫాతిమా జంక్షన్ ప్రాంతంలో సందర్శించి అక్కడ ఉన్న వావ్ వరంగల్ లోగో ప్రాంతంలో మొక్కలు పెరిగి అట్టి లోగో దెబ్బతిని ఉందని అట్టి లోగో కు వెంటనే మరమ్మత్తులు చేపట్టి వినియోగంలోకి తేవాలని కాళోజీ జంక్షన్ ప్రాంతంలో జంక్షన్ ను అభివృద్ధి చేయాలని, ములుగు రోడ్డు జంక్షన్ ను విస్తరించి అభివృద్ధి చేయాలని మేయర్ అధికారుల ను ఆదేశించారు.

**స్పాంజ్ పార్క్ ల ఏర్పాటుకు స్థల పరిశీలన**

ఇటీవల సిడిఎంఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో నగరంలో స్పాంజ్ పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించాలని కమిషనర్ కు సూచించిన నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణతో పాటు వర్షాకాలంలో నీటిని పీల్చుకొని భూమి లోకి పంపించి భూగర్భ జలాలను పెంపొందించడానికి వీలుగా స్పాంజ్ పార్క్ లను ఏర్పాటు చేయడానికి పోతన రోడ్డు తో పాటు బృందావన్ కాలనీలో రెండు చోట్ల మేయర్ కమిషనర్ లు స్థల పరిశీలన జరిపారు. సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఇన్చార్జ్ ఎస్ ఈ, మహేందర్, ఇంచార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, హెచ్ ఓ లు రమేష్, లక్ష్మా రెడ్డి, ఈ ఈ లు రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత, ఏసిపి రజిత, సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, టి పీఎస్ లు ఏర్షాద్, శ్రీకాంత్, పాల్గొన్నారు.



# స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ

## ప్రపంచంతో పోటీ పడాలనే పాలసీ తీసుకొచ్చాం : సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** పోరాట స్ఫూర్తి ఉన్న తెలంగాణ ప్రాంతం క్రీడల్లో రాణించాలని, ప్రపంచంతోనే పోటీ పడి దేశానికి గొప్ప పేరు తేవాలని తెలంగాణకు నూతన క్రీడా పాలిసీని తీసుకువచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన 'ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్'లో సీఎం పాల్గొన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి, ఒలింపిక్ పతక విజేత అభినవ్ బింద్రా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు ) ఏపీ జితేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ 2025' ను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. పలు అంతర్జాతీయ క్రీడా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం పలు ఎంవోయూలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించడం తమ ప్రభుత్వ విధానం అని, క్రీడా విధానంలో రాజకీయ జోక్యాన్ని తగ్గించి క్రీడాకారుల స్ఫూర్తిని పెంపొందించాలని తెలంగాణ రాష్ట్రంలో క్రీడా పాలసీని 2025 తీసుకువచ్చామని చెప్పారు. మా విజన్ డాక్యుమెంట్ తెలంగాణ రైజింగ్ 2047 లో స్పోర్ట్స్ పాలసీని ఒక అధ్యాయంగా పెట్టామన్నామన్నారు. ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తున్నామని చదువులోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాలన్నారు. పీపీపీ పద్ధతి లో తెలంగాణ నూతన క్రీడా విధానం తీసుకువచ్చామని.. కార్పొరేట్ రంగంలో సక్సెస్ రేటు ఉన్నవారు, క్రీడల్లో మెడల్స్ సాధించిన వారిని, స్పోర్ట్స్ యూనివర్సిటీ, వ్యవస్థలను నిర్వహించిన అనుభవం కలిగిన వారిని క్రోడీకరించి ప్రభుత్వం ఒక బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. ఎందరో గొప్ప గొప్ప క్రీడాకారులు హైదరాబాద్ నుంచే ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయితే ప్రభుత్వాలకు సరైన విధానాలు లేకపవడం వల్లే యువత వ్యసనాలకు బానిస అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించకపోవడం వల్లే మాదక ద్రవ్యాలు మన వైపు దూసుకు వస్తున్నాయన్నారు.



# జిఎంహెచ్ ప్రసూతి ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలు

## తల్లిపాల పై గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు అవగాహన సదస్సు

**హన్మకొండ మహా;** తల్లిపాల ప్రాముఖ్యత, పాలిచ్చే సరైన విధానం పై గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు అవగాహన కలిగించాలని, అలాగే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు ఇచ్చే సూచనలను తల్లులు పాటించాలని హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఎ.అప్పయ్య సూచించారు. ప్రతి సంవత్సరం తల్లిపాల ప్రాముఖ్యత పై 1వ తేదీ ఆగస్టు నుండి ఏడు ఆగస్టు వరకు నిర్వహించడం జరుగుతున్న దన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ లోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి జిఎం హెచ్ నందు తల్లిపాల వారోత్సవాల పై వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ తల్లిపాల వలన బిడ్డకు తల్లికి మధ్య అనుబంధం పెరుగుతుంది అని ,తల్లిపాలు బిడ్డ త్రాగడం వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ఎదుగుదల సరిగా ఉంటుంది అని తెలిపారు.ఏన్మ లు, ఆశా లు గృహ సందర్శన లేదా చెకప్ కు వచ్చినప్పుడు తగు సలహాలు సూచనలు, పాలు త్రాగించే సరైన పద్ధతిని నేర్పించాలని అన్నారు. ఈ సదస్సులో గర్భిణీ స్త్రీలు ,పాలిచ్చే తల్లులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది , అంగన్వాడి కార్యకర్తలు సూపర్వైజర్ లు పాల్గొన్నారు.

# వయో వృద్ధులకు మెరుగైన వైద్య సేవలందించాలి

## వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ



**మహా:** తెలంగాణా లోనే రెండవ అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రి అయిన మహాత్మాగాంధీ స్మారక వైద్యశాలతో పాటు అన్నీ ప్రభుత్వ వైద్యశాలలలో వయోవృద్ధులకు మెరుగైన వైద్య సేవ లందించాలని నిర్మలా గీతాంబ అన్నారు. శనివారం మహాత్మాగాంధీ స్మారక వైద్యశాలలో 'సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్' హనుమకొండ వారి అధ్వర్యంలో వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 పై ఏర్పాటుచేసిన శిక్షణ సదస్సులో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయోవృద్ధులకు ప్రత్యేక వార్డులను ఇతర సౌకర్యాలను ఏర్పాటుచేసి వారికి మర్యాదపూర్వకమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రతి కుటుంబంలో కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు.. ఇంటిలోని పెద్దవారిపట్ల ప్రేమ గౌరవ మర్యాదలతో మెలగాలని, వీరిని చూసి ఇంట్లోని పిల్లలుకూడా పెద్దవారితో సన్నిహితంగా ప్రేమగా మెలుగుతారని, అప్పుడు కుటుంబంలో చక్కని వాతావరణం నెలకొంటుందని అన్నారు. వారు ఇచ్చిన ఆస్తులను అనుభవిస్తూ వారిని వృద్ధాశ్రమా లలో వేయడం తగదని అన్నారు. ప్రజలకు వైద్యశాలల పై విశ్వాసం పెరిగే విధంగా వైద్యులు, ఇతర సిబ్బంది సేవలందించాలని అన్నారు. ఈ సందర్భంగా వారు తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎం.జి.ఎం. సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఎం.జి.ఎం. లో సీనియర్ సిటిజన్స్ కి మంచి వైద్య సేవలు అందిస్తున్నామని, వారికి ప్రత్యేక ఓ.పి. విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని త్వరలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తామనీ అన్నారు. కార్యక్రమంలో 'హెల్పేజ్ ఇండియా' సంస్థ రాష్ట్ర కొ ఆర్డినేటర్ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సమస్యలపై హెల్పేజ్ ఇండియా సర్వే లోని ప్రధానాంశాలను తెలుపుతూ '2007 తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం' సీనియర్ సిటిజన్స్ కోసం చేసిన ముఖ్యమైన చట్టాలను, వైద్య సేవలకు సంబంధించిన చట్టాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ, కార్యదర్శిసీనియర్ సివిల్ జడ్జ్ శ్రీ ఎం. సాయికుమార్, సమన్వయకర్త డా. మమత, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, రిటైర్డ్ డి.ఎస్.పి దామెర నర్సయ్యగారు, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షులు, హనుమకొండ సి.డబ్ల్యు.సి సభ్యులు కజాంపురం దామోదర్, కార్యవర్గ సభ్యులు నాగులగాం నర్సయ్య, మార్క రవీందర్ గౌడ్, సత్య నారాయణ, గంటి సాంబయ్య, గంగారపు యాదగిరి, వైద్య సిబ్బంది, నర్సులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# విజయ డెయిరీని సందర్శించిన ఎమ్మెల్యే రేవూరి

**హన్మకొండ మహా;** హనుమకొండ, ములుగు రోడ్డు సమీపంలో గల విజయ తెలంగాణ డెయిరీని శనివారం అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా డెయిరీ ప్రధాన కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలు, ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యత నియంత్రణ విధానాలు, విస్తరణ ప్రణాళికల గురించి సమగ్రమైన వివరణను అడిగి తెలుసుకున్నారు. దామెర మండలం ల్యాదల్ల లో నూతన పాల డైరీ ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. నాణ్యత నియంత్రణ ISI & FSSAI ప్రమాణాలతో నాణ్యత పరీక్షలు, హైజీన్ నిబంధనలు పాటిస్తూ ఉత్పత్తి ప్రక్రియ, డెయిరీ సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త మార్కెట్లలో విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా డిఆర్డిఓ మేన శ్రీనివాస్, వరంగల్ డిఆర్డిఓ కౌసల్య దేవి,విజయ తెలంగాణ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్ కుమార్ కుమార్, డెయిరీ రాష్ట్ర ఐ ఎన్ టి యు సి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి. అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచనలు అమలు చేయండి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచనలు అమలు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి మునిసిపల్, కాలుష్య నియంత్రణ మండలి, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ హరిత గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జిటి) నిబంధనల ప్రకారం కోట చెరువును, శుభ్రం చేయించాలని, ఘన, ద్రవ వ్యర్ధాల నిర్వహణపై ఎన్జీటీ ఆదేశించిన విధంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ , బయో హజార్డ్ మేనేజ్మెంట్ లను ప్రాసెసింగ్ చేసి డాక్యుమెంట్ తయారు చేసి అందజేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న లెగసీ వ్యర్థాలను టెండర్ ప్రాసెసింగ్ చేయాలని అన్నారు. ఎన్ జీ టి విధి విధానల ప్రకారం 17 ఏకరాల ల్యాండ్ ను రాంపూర్ డంప్ యార్డ్ లో నిర్వహించడం తో పాటు బయో మైనింగ్ పూర్తి చేయడం జరిగిందని, కొనుగోలు చేసిన ల్యాండ్ కు టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని నియంత్రించడానికి ఎన్ఫోర్స్మెంట్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని బల్దియా కమిషనర్ తెలిపారు.

**హరిత గ్రీన్ ట్రిబ్యునల్**

(ఎన్జిటి) నిబంధనలను అమలు చేయాలని, పర్యావరణ పరిరక్షణ కోసం త్వరలో జరిగే వినాయక పండుగ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించాలని, అందుకోసం కాలుష్య నియంత్రణ మండలి, పురపాలికల, కార్పొరేషన్ తరపు నుండి ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేయాలని, నగరంలోని కాలనీ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి కాలుష్యాన్ని అరికట్టడానికి మట్టి వినాయక విగ్రహాలను పూజించెల అవగాహన కలిగించాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసేలా శిక్షణ అందించి వాటిని కొనుగోలు చేసేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ. సునీత, బల్దియా సి ఏం హెచ్ ఓ డా రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ ఈ మహేందర్ ఏం హెచ్ ఓ డా.రాజేష్. నర్సంపేట, వర్ధన్నపేట మునిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు

## రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**కాటారం, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దుల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలంలోని తాడిచర్ల గ్రామంలో నూతన భవనాల ప్రారంభోత్సవం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.రైతులకు సౌకర్యాలు, గౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మల్హార్ మండలంలో తాడిచర్ల ప్రధాన కేంద్రంగా ఉందని తెలిపారు. ఈ గ్రామంలో రైతుల సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందిని పేర్కొన్నారు. ఈ క్రమంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన సహకార సంఘ కార్యాలయం, గోదాం భవనం, రూ.25 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం, రూ.7.80 లక్షలతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి రైతు వేదిక వరకు నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు, రూ.3.5 లక్షలతో పిఏసిఎస్ వద్ద నిర్మించనున్న ఆర్చిగేట్ నిర్మాణ పనులకు, 12 లక్షలతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ ప్రహరి గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తాడిచెర్ల గ్రామాన్ని ప్రధాన కేంద్రంగా ఉందని అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. సహకార సంఘం కార్యాలయం ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంత రైతులకు బ్యాంకు సేవలు, వ్యవసాయ రుణాలు మంజూరు సులభతరం అవుతుందన్నారు. బ్యాంకులో లాకర్లు వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాడిచర్ల గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం.కసరత్తులు కృషి చేస్తుందని, తాడిచెర్ల సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుందని వెల్లడించారు. తాడిచర్ల జూనియర్ కాలేజీలో చదువుకున్న విద్యార్థులు ప్రదానంగా బాలికలు పట్టణాలకు వెళ్లి ఉన్నత చదువుతున్నారని అభినందించారు. అధునాతన హంగులతో గ్రంథాలయం ఏర్పాటు ద్వారా విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ వనరులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు లభించని వారి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున రేషన్ కార్డులు, పాత రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల నమోదు పెద్ద ఎత్తున చేపట్టినట్లు తెలిపారు. తొమ్మిది రోజుల్లో రైతులకు 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా ద్వారా అందించామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు చేపట్టామని వెల్లడించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు.శనివారం తాడిచర్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి అందిస్తున్న వైద్యం, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, వైద్య సేవలు గురించి ప్రజల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి లో అందుబాటులో ఉన్న మందుల స్టాక్, శానిటేషన్ పరిస్థితులు, రికార్డుల నిర్వహణ, ఓపి రిజిస్టర్ తదితర అంశాలను సమీక్షించారు.

# డే కేర్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని



**హన్మకొండ మహా;** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ,హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్నా యిని రాజేందర్ రెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వృద్ధులతో సంభాషించిన అనంతరం తలసీమియా పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి విజయచందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పూల మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచితంగా డాక్టర్ల సేవలు, చెస్, క్యారమ్ వంటి ఆటల సౌకర్యం అందిస్తామన్నారు. వృద్ధులు సమయం విలువైనదిగా గడిపే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 37 డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో హనుమకొండలో రాష్ట్రంలో మొట్టమొదటిగా ఈ సెంటర్ ప్రారంభమవడం గర్వకారణమని తెలిపారు. రెడ్ క్రాస్ రక్తదానం, ఇతర సేవలకు రాష్ట్రంలో తొలి స్థానంలో నిలుస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వృద్ధులకు చేనేత కళాకారులు తయారు చేసిన టవెల్స్ తో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యేకు పాలకవర్గం షీల్డ్ అందించి సత్కరించింది. ఈ కార్యక్రమంలో డా. పి. విజయచందర్ రెడ్డి (చైర్మన్), బొమ్మినేని పాపిరెడ్డి (కోశాధికారి), ఈ.వి. శ్రీనివాస్ రావు (రాష్ట్ర పాలకవర్గ సభ్యులు), జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డా. ఎం. శేషుమాధవ్, బిళ్ల రమణ రెడ్డి, మహిళా శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ అధికారి జె. జయంతి, డిఆర్డిఓ పీ.డి. యం. శ్రీను, హనుమకొండ డిఎంహెచ్వో ఎ. అప్పయ్య, కేయూ ఈసీ సభ్యులు కె. అనిత రెడ్డి, వృద్ధులు, రెడ్ క్రాస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా మోడీ ప్రభుత్వం

- నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- రైతు ఖాతాలో పీఎం కిసాన్ నిధులు జమ
- కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రైతు ఖాతాలో పీఎం కిసాన్ నిధులు జమ అయిన సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో వ్యవసాయం, విద్య వైద్యం, రక్షణ సైనిక శాఖలో బలంగా ఉన్నామని, ఆపరేషన్ సింధూర ద్వారా ఉగ్రవాదులను తుదిముట్టించామని గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానంలో ఉన్న భారత్, త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా, యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో, ఉత్తర ప్రదేశ్ లోని వారణాసిలో ప్రధాని నరేంద్ర మోడీ, పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న సందర్భంగా, డిజిటల్ తెరపై స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఉన్న చిన్న సన్నకారు రైతులకు నరేంద్ర మోడీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు సబ్సిడీపై ఎరువులు, పురుగుల మందులను ఇస్తోందని గుర్తు చేశారు. యూరియా ఒక బస్తా రూ 2600 ఉండగా రైతులకు సబ్సిడీ ద్వారా 266కే ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

**కరోనా మందు ప్రపంచ దేశాలకు ఉచితంగా పంపిణీ**

గతంలో ప్రకృతి వైపరీత్యాలు వస్తే ప్రపంచ దేశాల వైపు మనం చూసే పరిస్థితి ఉండే, కానీ ఇప్పుడు భారత్లో ఆ స్థితిలో లేదని తెలియజేసారు. దేశం కరోనకు మందు తయారు చేసి 140 కోట్ల మందికి ఉచితంగా కరోనా వ్యాక్సిన్ ఇచ్చి, ప్రపంచ దేశాలకు ఉచితంగా పంపిణీ జరిగిందన్నారు. ఒకప్పుడు విదేశాల నుంచి పలు ఉత్పత్తులను దిగుమతి చేసుకునే వాళ్ళమని, ఇప్పుడు మనమే ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్నారు అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు లేనిదే రాజ్యం లేదని, రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్ గోపాల్ గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉషారాణి, అసిస్టెంట్ డైరెక్టర్ సుజాత, ఆర్డిఓ అనంతరెడ్డి, ఎమ్మార్వో అయ్యప్ప, ఎంపీడీవో రాధా రాణి, వివిధ శాఖల అధికారులు, రైతులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## నల్లాల కోసం గుంతలు తీశారు... కనెక్షన్ మరిచారు



**ఆమనగల్లు,మహా:** ఆమనగల్లు పట్టణంలోని 9వ వార్డు విద్యానగర్ కాలనీలో మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ నల్లాలను ఇంటింటికి ఏర్పాటు చేశారు.. గుంతలు తీసి కనెక్షన్ఇవ్వడం మరిచారని కాలనీ అధ్యక్షుడు పాష చెప్పారు.శనివారం విద్యానగర్ కాలనీ వాసులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కింద కాలనీలో మిషన్ భగీరథ నీళ్ల గుంతలు తీసి కలెక్షన్లు ఇవ్వడం మరిచారని,ఇంతకు విద్యానగర్ కాలనీలో మిషన్ భగీరథ నీళ్ల కలెక్షన్ ఉన్నట్టా...? లేనట్టా...? అని కాలనీ అధ్యక్షులు యంఎ పాషా, అన్నారు.. ఇంటింటికి నల్ల కనెక్షన్లు ఇవ్వాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదన్నారు.ఆమనగల్లు పట్టణంలోని అతిపెద్ద కాలనీ అయిన విద్యానగర్ కాలనికి ఇప్పటివరకు మిషన్ భగీరథ నీళ్లు సప్లై లేదని,.కాలనీలో ఉన్న ఇళ్లకు నీటి సరఫరా అందజేసి ప్రతి ఇంటికి నీళ్ల కలెక్షన్ ఇవ్వగలరని మిషన్ భగీరథ అధికారులకు,మున్సిపల్ కమిషనర్ వినతి పత్రాలు అందజేశామని,ఈ విషయంపై కమిషనర్, జిల్లా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాములు, అంకయ్య, మల్లయ్య, రఘుమాచారి, సిరాజ్ ఉన్నారు.

## అమ్మ కంటే గొప్పోళ్ళు కార్మికులు..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** పట్టణ సుందరీకరణ కోసం అహర్నిశలు కష్టించే కార్మికులు అమ్మ కంటే గొప్పోళ్ళని, వారి కష్టాన్ని, కృషిని గుర్తించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా 100 రోజుల కార్యక్రమాన్ని చేపట్టిన మున్సిపల్ అధికారులు శనివారం మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై కార్మికులకు దుస్తులు, సరిపడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... మున్సిపల్ సుందరీకరణ లో కార్మికులు ఒకరోజు పని చేయకపోయినా పరిశుభ్రత అస్తవ్యస్తంగా ఉంటుందని, నిరంతరం కార్మికులు పని చేస్తూనే ఉంటారని ఇలాంటి వారికి శిరస్సు వంచి నమస్కరించాలని ఆయన కొనియాడారు. కార్మికులకు అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**దసరా బోనస్ గా ఒక్కొక్క కార్మికుడికి 2500**

రాబోయే దసరా సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు పండుగ బోనస్ గా 2500 లను తన సొంత నిధుల నుంచి అందజేయనున్నట్లు ఎమ్మెల్యే శంకర్ ప్రకటించారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కార్మిక విభాగాల్లో 100% పని చేసినా కార్మికులలో డిపార్ట్మెంట్ కు ఇద్దరి చొప్పున 5వేల రూపాయలను అందజేసి, గాంధీ అవార్డులకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి మాట్లాడుతూ.. పట్టణ సుందరీకరణకు కార్మికులు కృషి చేస్తున్నారని, మరి అవసరాలకు అనుగుణంగా దుస్తులను, సభ్యులను చెప్పులను అందజేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న 166 మంది కార్మికులకు ఈ దుస్తులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బస్వం, పట్టణ అధ్యక్షులు చెన్నయ్య, రఘు, దంగు శీను, ఇబ్రహీం, యువనేత అందె మోహన్, మునావర్, ఖదీర్ మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, కార్మికులు తదితరులు ఉన్నారు.



## విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

**డీవీఎంసీ శశికాంత్**

**తలమడుగు, మహా:** ప్రతి విద్యార్థి రాజ్యాంగంలోని హక్కుల గురించి తెలుసుకోవాలని డివిఎంసి సభ్యులు ఐండ్ల శశికాంత్ అన్నారు. తలమడుగు మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన ఝరి పున్నగూడ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను శనివారం డివిఎంసి సభ్యులు ఐండ్ల శశికాంత్ సందర్శించడం జరిగింది. వారు మాట్లాడుతూ పిల్లలకు మంచి విద్యతోపాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నానని అన్నారు. క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలని శరీరక దృఢత్వం పెంచేలా పిటి ఉపాధ్యాయుడు విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు. చట్టాల గురించి ప్రాథమిక హక్కులు, పౌర హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ కోరంగి రాము, ప్రధానోపాధ్యాయుడు సరస్వతి, నాయకులు క్రాంతి కుమార్, పొచ్చన్న లు ఉన్నారు.

## కాలం చెల్లిన యంత్రాలతో యాజమాన్యం

# విధులను కొనసాగిస్తుంది

### మృతుడు శ్రావణ్ కుమార్‌కు కార్మిక సంఘాల నివాళులు



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న కార్మిక శాఖ మంత్రి



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**మందమర్రి, మహా :** కాలం చెల్లిన యంత్రాలతో సింగరేణి యాజమాన్యం కార్మికులను విధులకు పురమాయిస్తుందని ఐ ఎన్ టి యు సి నాయకులు రామ్ శెట్టి నరేందర్, మిట్ట సూర్యనారాయణ, సిఐటియు నాయకులు ఎస్ వెంకట స్వామి, అల్లి రాజేందర్, టీబీజీకేఎస్ నాయకులు ఓ రాజశేఖర్, జంగిలి రవీందర్, సింగరేణి గుర్తింపు సంఘం మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కంది శ్రీనివాస్ లు విమర్శించారు. శనివారం మందమర్రి ఏరియా కే.కే5 గని వద్ద సింగరేణి యాజమాన్యం పై విమర్శల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గని లక్ష్యాన్ని చేదించడం కొరకు రక్షణ లేని పని స్థలాలలో అధికారులు కార్మికులతో విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం గనిలో విధులు నిర్వహించేందుకు రెండవ బదిలీకి వచ్చిన జనరల్ మజ్దూర్ కార్మికుడు రాచపల్లి శ్రావణ్ కుమార్ ను యాక్టింగ్ ఎస్ డి ఎల్ ఆపరేటర్ గా 20 డిప్ 32 ఆఫ్ లెవల్ నాల్గవ సిమ్ కు షిఫ్ట్ అధికారులు పంపించారని అన్నారు. అయితే పని స్థలంలో విధులు నిర్వహిస్తుండగా ఎస్.డి.ఎల్. మోరాయించిందని చెప్పారు. దానితో శ్రావణ్ యంత్రాన్ని దిగి ఎందుకు ఆగిపోయిందో చూస్తున్న క్రమంలో సైడ్ బొగ్గు పెల్లలు కూలి ప్రమాదానికి గురైయ్యాడని అన్నారు. కాలం చెల్లిన ఎస్ డి ఎల్ యంత్రాలతో పనులు చేపియడంతోనే ఈ ప్రమాదం జరిగిందని వారు అన్నారు. ప్రమాద ఘటన తెలుసుకున్న గని అధికారులు, యూనియన్ నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన శ్రావణ్ కుమార్ ను సింగరేణి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించామని వెల్లడించారు. కాగా ఉన్నత వైద్య సదుపాయం కొరకు వైద్యులు కరీంనగర్ కు తరలిస్తుండగా తాను మృత్యువాత పడడం పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. మృతుడు శ్రావణ్ కుమార్ (32) గత 2015 సంవత్సరంలో సింగరేణి కంపెనీలో ఉద్యోగానికి చేరాడు. మృతుడికి కార్మిక సంఘాల నాయకులు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, టిఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ రాజా రమేష్, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు ఓ రాజశేఖర్, మాజీ జెడ్పిటిసి వేల్పుల రవి, రాగిడి కుమార్ తదితరులు గుర్తుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణ్ మృతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**కుటుంబ సభ్యులను పరామర్శించిన కార్మిక శాఖ మంత్రి**

మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ నివాసి మృతుడు శ్రావణ్ కుటుంబ సభ్యులను చెన్నూరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేకానంద శనివారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్మికుని సేవలకు గౌరవం తెలుపుతూ ప్రతి కార్మికుడు మన సొంత కుటుంబ సభ్యుడే అని అన్నారు. సింగరేణి కార్మికుల ప్రాణ త్యాగాలు వృధా పోవని అన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ఆర్థిక, న్యాయ, ప్రభుత్వ సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యుల కోసం తక్షణ పరిహారం, ఒకరికీ ఉద్యోగావకాశంతో పాటు పని స్థలాలలో భద్రతా ప్రమాణాలపై విచారణ కోసం అధికారులను ఆదేశించారు. సింగరేణి కార్మికుల భద్రత పట్ల రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సాంకేతిక, భద్రతా పరంగా తగిన సంస్కరణలు తీసుకురావాలని సింగరేణి కంపెనీ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

## ప్రభుత్వ పాఠశాలకు దాతల చేయూత..

**సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య :ఎంఈఓ పాండు**



**ఆమనగల్లు, మహా:** విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని మండల విద్యాధికారి పాండు సూచించారు. సర్కారు పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వము విద్యకు అందిస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని గ్రామ యువత సహకారంతో మండల పరిధిలోని గౌరారం గ్రామంలోని మూతబడిన జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలను తిరిగి పున ప్రారంభించారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 15 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారి విద్య కు మౌలిక వసతుల కల్పనకు ఆకుతోటపల్లి గ్రామ యువ నాయకుడు న్యాలపట్ల నరేందర్ రెడ్డి రూ 55వేలు ఇతరులు కలిపి లక్ష రూపాయల విలువ గల సామాగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ పాండు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. గ్రామీణ విద్యార్థులకు విద్యాభివృద్ధిలో తోడ్పాటును అందించే దిశగా కృషి చేయడం అభినందనీయమని గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువ నాయకులు న్యాలపట్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే ఉన్నత లక్ష్యాలతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. విద్యార్థుల ఉన్నత విద్యకు అవసరమైతే మరిన్ని సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూఉంటాయన్నారు. అనంతరం మండల విద్యాధికారి పాండు,పాఠశాలప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసాచారి దాతలను సన్మానించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు రాజశేఖర్,వినోద్ కుమార్ రెడ్డి, రాకేష్ రావు, వెంకటరమణ, శివ, వీరేష్,రాఘవేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచారి, ఉపాధ్యాయ బృందం దివ్య, నరేందర్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి సారు జర మా రోడ్డును బాగు చేయించుండ్రి

**కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానందకు బాజాపా వినతి**



**మంచిర్యాల, మహా :** చెన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి సారు జర మా రోడ్డును బాగు చేయించుండ్రి అంటూ భాజపా నేతలు డివి దీక్షితులు, వంజరి వెంకటేష్, దేవరనేని సంజీవరావు, జి జనార్ధన్, ధార వేణి రవికుమార్, రాచర్ల మహేందర్, దుర్గ మల్లేష్, కర్రె రాజన్న, ఏ రాజయ్య లు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి మండలం ఆదిల్ పేట నుండి రసూల్ పల్లి చెన్నూర్ ఎక్స్ రోడ్డు వరకు దాదాపు పది కిలోమీటర్లు ఉంటుందని అన్నారు. ఈ రోడ్డు పొన్నారం, గుడిపల్లి, కానుకూర్, మిట్టపల్లి, ముదికుంట మీదుగా రసూల్ పల్లెకు చేరుతుందని చెప్పారు. ప్రస్తుతం ఈ రోడ్డు పరిస్థితి చాలా అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు వస్తే కల్వర్టులో ప్రజలు కొట్టుకపోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. ఈ గ్రామాల ప్రజలు అవసరాలకు వ్యవసాయం, పనిముట్లు, బ్యాంకు, నిత్యవసర వస్తువులు కొనుగోలుకు రాకపోకలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ ఆసుపత్రి పాలవుతున్నారని వెల్లడించారు. మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ నుండి గుడిపల్లి లేమూరు, ఎమ్మెల్యే కాలనీని వేరు చేసి గ్రామ పంచాయతీగా ప్రకటించాలని మైనింగ్, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేకానంద ను భారతీయ జనతా పార్టీ నాయకులు కోరారు. వెంకటాపూర్ పంచాయతీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2500 పై జనాభా కలిగి ఉన్నారని తెలిపారు. ఈ పంచాయతీలో 1700 ఓట్లు, పది వార్డులు ఉన్నాయని చెప్పారు. గతంలో లేమూరు గుడిపల్లి అనే గ్రామం ఉండేదని అది కాస్త రాను రాను వెంకటాపూర్ గ్రామపంచాయతీలో చేర్చారని వెల్లడించారు. ప్రస్తుతం లేమూరు గుడిపల్లి ఎమ్మెల్యే కాలనీ కలుపుకొని ఐదు వార్డులలో 1,000 పైగా ప్రజలు ఉన్నారని వివరించారు. గుడిపల్లి బూతు 89 లో 700కు పైగా ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని అర్హతలు ఉన్న లేమూరును ప్రత్యేక గ్రామపంచాయతీగా ప్రకటించేలా చర్యలు చేపట్టాలని భాజపా నాయకులు వంజరి వెంకటేష్ కార్మిక శాఖ మంత్రిని కోరారు.

## అక్రమ సంబంధం పెట్టుకున్న భర్తకు దేహశుద్ధి



**రాజేంద్రనగర్, మహా ;** తన భర్త మరో మహిళతో ఏకాంతంగా ఉండగా చూసి భార్య కుటుంబ సభ్యులు భర్తని దేహశుద్ధి చేసిన ఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం. వీరిది 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం పెద్దల సమక్షంలో మరోసారి పెళ్లి చేసుకుని హైదర్ షాకోట్ బాలాజీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వేణు కుమార్ అతని భార్యను దూరం పెట్టి మరో మహిళతో వివాహేత సంబంధం పెట్టుకొని మాధవి నగర్ లో మఖం పెట్టాడు. శనివారం వేణు కుమార్ మరో మహిళతో గదిలో ఉండగా శిరీష కుటుంబ సభ్యులు బంధువులు కలిసి వారిని బంధించి దేహశుద్ధి చేసి నార్సింగి పోలీసులకు అప్పగించారు. తనకు తన కుమారునికి న్యాయం చేయాలని పోలీసులను కోరింది.

## విద్య, వైద్య రంగాల వృద్ధిలో రాజీ పడేది లేదు

**రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



**మంచిర్యాల, మహా :** విద్య, వైద్య రంగాల వృద్ధిలో రాజీ పడేది లేదని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శనివారం మందమర్రి మండలం రామకృష్ణాపూర్ మునిసిపాలిటీ కాకతీయ కాలనీలో ఆధునీకరించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య లతో కలిసి ప్రారంభించి విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో వన మహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మండల తహశిల్దార్ సతీష్ కుమార్, క్యాతన్ పల్లి మున్సిపల్ కమీషనర్ జి రాజులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రతి ఒక్కరు చదువుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసిందని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో త్రాగు నీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలోని ఒక్కొక్క నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని సోమనపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఏర్పాటు చేశామని తెలిపారు.

## అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రికి సిఐటియు వినతి



**మంచిర్యాల, మహా :** అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నెలకొని ఉన్న అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 2 యాప్ ల పేర్లతో అంగన్వాడీలను పని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కాకుండా బి ఎల్ వో విధులు, ఇతర పనులు, సర్వేలు చేపిస్తూ అంగన్వాడీలను శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఐసీడిఎస్ జిల్లా పిడి రాష్ట్రంలో ఎక్కడ లేని విదంగా జిపిఎస్ యాప్ ను పెట్టి ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జిపిఎస్ ద్వారా ఫోటోలు పెట్టాలని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా జిపిఎస్ యాప్ ను, పేస్ మాక్చర్ యాప్ ను రద్దు చేసి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు పక్క భవనాలు నిర్మించి, కనీస సౌకర్యాలు కల్పించాలని చెప్పారు.

## నూతన రోడ్లను నిర్మించండి

**మంత్రి కి వినతి పత్రం అందజేసిన మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్**



**రాజేంద్రనగర్, మహా ;** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు గుంతల మయంగా మారాయి. నిత్యం వాహనదారులు గుంతల రోడ్డులతో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. రోడ్లపై వాహనాలతో పాటు ప్రజలు నడవలేక రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. లింక్ రోడ్ల విస్తరణ, నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమి కేటాయించి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని మంత్రికి కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ షా ఖాన్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయాలి

**బీసీ అంశాలను అమలు చేయాలని నిరసన**




**మంచిర్యాల, మహా :** కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మంచిర్యాల పట్టణం అంబేద్కర్ చౌక్ వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మ్యానిఫెస్టోలో పెట్టిన బీసీ అంశాలను నెరవేరుస్తానని హామీ ఇచ్చి అధికారం వచ్చిందని అన్నారు. ఇలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు అవుతున్న ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం బీసీ సమాజాన్ని మభ్యపెట్టడం కొరకే బీసీ అంశాలు తెరమీదకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హోదాతో మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ సివిల్ కన్స్ట్రాక్షన్ మెంటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, చిరు వ్యాపారులకు విద్యార్థుల ఉన్నత విద్య కోసం 10 లక్షల వరకు పూచి కత్తులేని వడ్డీ లేని రుణాలు ఇస్తామని ఇతరాత్ర హామీలు ఇచ్చి ఊర్కుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర బీసీ జేఏసీ నాయకులు గజెల్లి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి శాఖ పురం భీమసేన్, ఏదునూరు రమేష్, కీర్తి బిక్షపతి, చంద్రగిరి చంద్రమౌళి, రంగు అశోక్, గుండా రాజమల్లు, వేముల అశోక్, ఆరెందుల రాజేశం, అంకం సతీష్, జక్కం పూర్ణచందర్, నాయకులు పాల్గొన్నారు.

# ఇంటి డాక్యుమెంట్లు బ్యాంక్ పోగొడితే?



బ్యాంక్ రుణంతో ఇల్లు కొనడం తెలిసిందే.. ఇంటి దస్తావేజులు తనఖాగా పెట్టి రుణం తీసుకోవడం కామనే! ప్రతినెలా క్రమం తప్పకుండా ఈఎంఐ కట్టేసి.. చివరకు బ్యాంక్ నుంచి నో డ్యూ సర్టిఫికెట్ కూడా తీసుకున్నాక.. తనఖా పెట్టిన ఇంటి దస్తావేజులు ఎక్కడో పోయాయని బ్యాంక్ చెబితే? బ్యాంక్ అధికారులతో గొడవ పెట్టుకుంటాం. లేకపోతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సర్టిఫైడ్ సేల్ డీడ్ కాపీ కోసం దరఖాస్తు చేస్తాం.. అంతేకదా!? మహారాష్ట్రకు చెందిన ప్రదీప్ శెట్టి అలా చేయలేదు. 2004లో ప్రదీప్ మహారాష్ట్ర పరెల్‌లోని స్టాండర్డ్ చార్టెర్డ్ బ్యాంక్‌లో రూ.9 లక్షల గృహ రుణం తీసుకున్నాడు. అన్ని ఈఎంఐలు కట్టేశాక, బ్యాంక్ నుంచి నో- డ్యూస్ సర్టిఫికెట్ కూడా పొందాడు. ఆ తర్వాత బ్యాంక్ అందించాల్సిన సేల్‌డీడ్ కాపీలను ఇవ్వకుండా అవెక్కడో మిసయ్యాయని వివరించింది. దీంతో ప్రదీప్ 'తనఖా పెట్టిన దస్తావేజులను బ్యాంక్ ఎక్కడో పోగొట్టింది. ప్రాపర్టీ ధరలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో సేల్‌డీడ్ కాపీలు లేకపోవడంతో ఇంటిని విక్రయించలేకపోతున్నానని, పైగా ఈ ఘటనతో మానసిక వేదనకు గురయ్యాయని, విలువైన సమయం వృథా చేసినందుకు బ్యాంక్ పరిహారాన్ని చెల్లించాల్సిందేనని' డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు.

**పరిహారం సరిపోలేదు..**

ప్రదీప్‌కు రూ.60 వేలు నష్ట పరిహారాన్ని బ్యాంకు చెల్లించాలని డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ కమిషన్ తీర్పునిచ్చింది. ఇందులో రూ.50 వేలు దస్తావేజులు పోగొట్టినందుకు, రూ.5 వేలు మానసిక వేదనకు గురి చేసినందుకు, మరో రూ.5 వేలు ఫిర్యాదు దాఖలు ఖర్చులకు అని వివరించింది. అయితే ఈ పరిహారంతో సంతృప్తి చెందని ప్రదీప్ షెట్టి.. మహారాష్ట్ర స్టేట్ కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్‌ను ఆశ్రయించాడు. దీంతో స్టేట్ ఫోరం.. పరిహార మొత్తాన్ని రూ.60 వేల నుంచి రూ.1.15 లక్షలకు పెంచింది. 3 నెలల్లోపు కస్టమర్‌కు సర్టిఫైడ్ సేల్‌డీడ్ కాపీని అందించాలని, లేనిపక్షంలో ప్రతి నెలా రూ.50 వేల జరిమానా చెల్లించాలని తీర్పునిచ్చింది.

**ఎవరైనా సరే ఇలా చేయండి**

కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ ఇచ్చిన తీర్పు కేవలం ప్రదీప్ శెట్టికే కాదు.. మనలో ఎవరి ప్రాపర్టీ దస్తావేజులైనా సరే బ్యాంక్‌లు పోగొడితే.. కస్టమర్ పరిహారంతో పాటూ తిరిగి సర్టిఫైడ్ సేల్‌డీడ్ కాపీని కూడా అందించాల్సిన బాధ్యత బ్యాంక్‌లదే! ఇందుకోసం స్థానిక కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్‌ను సంప్రదిస్తే చాలు! ఒకవేళ ఇంట్లో దాచిపెట్టుకున్న ప్రాపర్టీ దస్తావేజులు దొంగలు పడో లేక ఇతర కారణాలతో మిస్ అయితే? దస్తావేజులు పోయాయని కంగారు పడకండి. మళ్లీ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి సర్టిఫైడ్ దస్తావేజులను పొందొచ్చు. కాకపోతే కొంత శ్రమించాల్సి ఉంటుంది.

**సర్టిఫైడ్ కాపీని ఇవ్వాలని కోరుతూ..**

ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సేల్ డీడ్ పోయిందని ఫిర్యాదు చేయాలి. ఆ తర్వాత దస్తావేజులు పోయినట్టుగా స్థానిక వార్తా పత్రికల్లో ప్రకటన ఇవ్వాలి. ఎవరికైనా దొరికితే సమాచారం అందించాలని కోరుతూ నోటీసు ఇవ్వాలి. గతంలో ఏదైతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రాపర్టీని రిజిస్ట్రేషన్ చేయించారో మళ్లీ అదే కార్యాలయానికి వెళ్లి ఒరిజినల్ సేల్‌డీడ్ దస్తావేజులు పోయినట్లు సంబంధిత అధికారికి వివరించి సర్టిఫైడ్ కాపీని ఇవ్వాలని కోరుతూ స్వీయ దస్తూరితో లెటర్ రాసివ్వాలి. ఫామ్-22లో పేరు, చిరునామా వంటి వివరాలన్నీ నమోదు చేసి.. ప్రాపర్టీ జిరాక్స్ కాపీలను జత చేయాల్సి ఉంటుంది. అలాగే సంబంధిత ప్రాపర్టీ పేరు మీద ఉన్న ఆధార్, పాన్, రేషన్ కార్డ్, కరెంట్ బిల్లు వంటివి జత చేయాలి. వీటన్నింటికీ పోలీసు ఫిర్యాదు కాపీ, పత్రిక ప్రకటన జత చేసి సబ్ రిజిస్ట్రార్‌కు అందించాలి. నిర్ణయించబడిన ఫీజును చెల్లిస్తే సరిపోతుంది.

# ఆటోల ధరలు ఖరారు..

## ఎక్కువకు విక్రయించకుండా చర్యలు

ఆటో రిక్షా ధరలను రవాణాశాఖ ఖరారు చేసింది. ఎల్పీజీ ఆటో రిక్షా ధరను రూ.2.70 లక్షలుగా, సీఎన్జీ ఆటో రిక్షా ధరను రూ.2.80 లక్షలుగా నిర్ణయించింది. నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌లు కుమ్మక్కై అడ్డగోలుగా ధరలు పెంచినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈసారి అలాంటి బ్లాక్ మార్కెటింగ్‌కు అవకాశం లేకుండా నియంత్రించింది. ఓఆర్ఆర్ పరిధిలో నడిపేందుకు వీలుగా సుమారు 65 వేల ఆటో పర్మిట్‌లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. వీటిలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలు కాగా, మరో 20వేల ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు సైతం అనుమతినిచ్చారు. ఇప్పటికే సీఎన్జీ లేదా ఎల్పీజీతో నడుస్తున్న సుమారు 25 వేల ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకొనేందుకు అవకాశం కల్పించారు.

**20 వేల ఆటోలకు ప్రొసీడింగ్‌లు..**

అర్హులైన ఆటో డ్రైవర్‌లు దరఖాస్తు చేసుకొనేందుకు షోరూమ్‌లలోనే ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న డ్రైవర్ల వివరాలను పరిశీలించి కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు ప్రొసీడింగ్‌లు (అనుమతులను) ఇచ్చారు. ఇప్పటి వరకు సుమారు 20 వేల ఆటోరిక్షాలకు అనుమతులను ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

**రంగంలోకి కన్సల్టెంట్‌లు...**

ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు ప్రొసీడింగ్‌ల ప్రక్రియ ముగింపు దశకు చేరడంతో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌లు రంగంలోకి దిగారు. అక్రమార్జనకు తెరలేపారు. షోరూమ్‌లలో ధరలను ఖరారు చేసినట్లుగా ఫైనాన్షియర్‌ల అక్రమాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆటోరిక్షా విక్రయాల్లో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌ల మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.





# ఒక్క నెలలో 98 లక్షల వాట్సాప్ అకౌంట్లు బ్యాన్

ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ గత జూన్ నెలలో భారత్‌లో భారీ సంఖ్యలో అకౌంట్లను బ్యాన్ చేసింది. దుర్వినియోగం, హానికరమైన కార్యకలాపాలను నిరోధించే ప్రయత్నాలలో భాగంగా జూన్ నెలలో భారత్‌లో 98 లక్షలకు పైగా ఖాతాలను నిషేధించింది. వీటిలో 19.79 లక్షల ఖాతాలను యూజర్ల ఫిర్యాదులు రాకముందే బ్యాన్ చేసింది. వాట్సాప్‌లో అనుమానాస్పద, హానికరమైన ఖాతాలపై యూజర్ల నుంచి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు అందుతుంటాయి. అందులో భాగంగా వాట్సాప్ కు భారత్ లోని యూజర్ల నుంచి 23,596 ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించి 1,001 ఖాతాలపై చర్యలు తీసుకున్నారు. ఇందులో కొన్ని ఖాతాలను నిషేధించడం, తప్పుగా నిషేధించిన మరికొన్నింటిని పునరుద్ధరించడం వంటివి ఉన్నాయి. వీటిలో 16,069 ఫిర్యాదులు నిషేధ అప్పీళ్లకు సంబంధించినవే కావడం గమనార్హం. ఫలితంగా 756 ఖాతాలపై చర్యలు తీసుకున్నారు. ఇతర ఫిర్యాదులు ఖాతా మద్దతు, ఉత్పత్తి సంబంధిత సమస్యలు, భద్రతా సమస్యల గురించి ఉన్నాయి.

ఖాతా క్రియేట్ చేసినప్పుడు, మెసేజ్‌లు పంపుతున్నప్పుడు, యూజర్ రిపోర్టులు లేదా బ్లాక్స్ వంటి నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చినప్పుడు మూడు దశల్లో దుర్వినియోగాన్ని గుర్తిస్తామని వాట్సాప్ వివరించింది. నివారణ తమ ప్రాథమిక దృష్టి అని కంపెనీ తెలిపింది. ఎందుకంటే హానికరమైన చర్యను తరువాత గుర్తించడం కంటే అది జరగడానికి ముందు ఆపడం మరింత ప్రభావవంతంగా ఉంటుంది. దుర్వినియోగం, తప్పుడు సమాచారం, భద్రతా ముప్పులతో పోరాడటానికి ఎండ్‌టుఎండ్ ఎన్క్రిప్షన్, భద్రతా సాధనాలు, ప్రత్యేక బృందాలను ఉపయోగిస్తున్నట్లు వాట్సాప్ యాజమాన్యం పేర్కొంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# రష్యా సమీపంలోకి... అణు జలాంతర్గాములు!

## అమెరికా అనూహ్య నిర్ణయం.. డెడ్ హ్యాండ్ హెచ్చరికలకు ప్రతిగానే

**మాస్కో:** అగ్ర రాజ్యాలు అమెరికా, రష్యా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. శుక్రవారం అమెరికా రెండు అణు జలాంతర్గాములను రష్యా సమీపంలో మోహరించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా హాండిల్ ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహాయకుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ డ్మిత్రీ మెద్వెదెవ్ చేసిన 'డెడ్ హ్యాండ్' హెచ్చరికలకు ప్రతిస్పందనగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. "అవి మతిలేని, రెచ్చగొట్టే ప్రకటనలు. నిజంగానే అలాంటి పరిస్థితి తలెత్తే ఆస్కారముంటే దీటుగా స్పందించేందుకే ఈ నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. రెండు సబ్‌మెరైన్లను సరైన ప్రదేశాల్లో మోహరించాల్సిందిగా ఆదేశించా" అని వివరించారు.

**ఏమిటీ డెడ్ హ్యాండ్?**

ఇది రష్యా (నాటి సోవియట్ యూనియన్) అభివృద్ధి చేసిన ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి వ్యవస్థ. ఆ దేశంపై ఎవరన్నా అణు దాడి చేస్తే అందుకు ప్రతిగా ఆటోమేటిగ్గా అణు దాడులు జరుపుతుంది. దేశ నాయకత్వం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయినా తనంత తానుగా స్పందించి దాడులకు దిగటం దీని ప్రత్యేకత.



భూమిపై ఎక్కడైనా కొట్టగల క్షిపణి: రష్యా

అత్యాధునిక హైపర్‌సోనిక్ క్షిపణులను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నట్టు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఈ ఏడాది చివర్లో వాటిని బెలారస్‌లో మోహరించే యోచన ఉందని తెలిపారు. రష్యాకు అత్యంత సన్నిహిత దేశమైన బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకోతో కలిసి సెయింట్ పీటర్స్‌బర్గ్ సమీపంలో పుతిన్ మీడియాతో మాట్లాడారు. "ఈ క్షిపణులకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. సంవత్సరాంతానికి ఉత్పత్తిత మొదలవుతుంది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ఒరెష్నిక్, దానికి సంబంధించిన ఆయుధ వ్యవస్థలను గత అక్టోబర్‌లో పుతిన్ రంగంలోకి దించారు. ఆ సందర్భంగా ఒరెషినిక్ సామర్థ్యాలను ప్రస్తుతించారు. "సంప్రదాయ, అణు వార్‌హెడ్లు రెండింటినీ మోసుకెళ్లగలగడం దీని ప్రత్యేకత. లక్ష్యం భూమిపై ఎక్కడున్నా ఇప్పటికైనా ఈ క్షిపణులు ఆదుకోవాల్సిందే. ఇవి దాదాపుగా మాక్ 10 వేగంతో దూసుకెళ్తాయి.

# అగ్రరాజ్యంతో పోటీపడుతున్న భారత్

## నియామకాల్లో ప్రపంచంలో మనమే మేటి.. అత్యధిక ఏఐ నైపుణ్యాలతో రెండో స్థానం

### 3 టాప్ ఐటీ కంపెనీల్లో నియామకాల జోరు.. పనిచేస్తున్న ఏఐ నిపుణులు 2.5 లక్షలకుపైనే

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. నిపుణుల నియామకాల్లో తొలి స్థానంలో నిలిచి మన దేశం ప్రపంచం ఔరా అనిపించేలా చేసింది. మొత్తం ఏఐ నైపుణ్యాల్లో.. అత్యధిక నైపుణ్యాలున్న దేశం అమెరికా కాగా, రెండో స్థానంలో భారత్ ఉంది. అంటే అగ్రరాజ్యంతో నువ్వా నేనా అన్నట్టు భారత్ పోటీపడుతోంది. పేటెంట్లు.. అందులో మళ్లీ ఏఐ పేటెంట్ల విషయంలో మాత్రం మనం చాలా వెనకబడి ఉన్నాం. ప్రపంచంలో అత్యధిక ఏఐ నైపుణ్యాలు కలిగిన ఐటీ ఇంజనీర్లు ఉన్న దేశాల్లో యూఎస్ టాప్-1లో నిలిచింది. మొత్తం ఏఐ నైపుణ్యాల్లో.. ఈ దేశంలోని ఐటీ ఇంజనీర్లలో సగటున 2.63 శాతం నైపుణ్యాలు ఉన్నాయి. మనదేశంలో ఇది 2.51 శాతంగా ఉంది. ఈ విషయంలో యూకే, జర్మనీ, బ్రెజిల్, కెనడా, ఫ్రాన్స్, స్పెయిన్ మన కంటే వెనుకబడి ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ ఇంజనీర్లలో ఏఐ నిపుణుల వాటా 1 శాతమే. భారత్‌లో లింక్డ్‌ఇన్ ప్లాట్‌ఫామ్‌పై గత ఏడాది జరిగిన మొత్తం నియామకాల్లో 33.39 శాతం ఏఐ సంబంధ రోల్స్ ఉండడం విశేషం. ఈ స్థాయిలో ఏఐ రిక్రూట్‌మెంట్ జరగడంతో ప్రపంచంలోనే మనం టాప్‌లో నిలిచాం. ఏఐ పబ్లికేషన్ల విషయంలో కూడా 2013-23 మధ్య 9.22 శాతం వాటాతో అమెరికా (America)



కంటే మనమే ముందున్నాం. ఈ విషయంలో చైనా (China) 23.20 శాతంతో మొదటి స్థానంలో ఉంది.

**పరిశోధకుల్లో వెనకడుగే..**

అంతర్జాతీయంగా ఏఐ పరిశోధకుల్లో టాప్-2 శాతంలో మనవాళ్లు లేకపోవడం నిరాశపరుస్తోంది. ఈ విషయంలో యూఎస్, చైనా ఆధిపత్యం చెలాయిస్తున్నాయి, మరో ముఖ్యమైన విషయం.. మన ఏఐ నిపుణులు (AI Experts) మనదేశం నుంచి తరలిపోవడం. గత ఏడాది లింక్డ్‌ఇన్ ప్లాట్‌ఫామ్‌పై.. భారత్‌లో సగటున ప్రతి 10,000 మంది ఏఐ నిపుణులకుగాను 1.55 మంది మన దేశం నుండి నిష్క్రమించారు. ఇలా అత్యధికులు వెళ్లిపోతున్న దేశంగా ఇజ్రాయెల్ తరువాత మనదేశం ఉందని 'స్టాన్ ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ 2025' నివేదిక వెల్లడించింది.

**పేటెంట్లలో చైనా జోరు..**

ఏఐ పేటెంట్లలో కూడా మన దేశం వెనుకబడి ఉంది. 2024లో ప్రైవేట్ ఏఐ పెట్టుబడుల్లో కేవలం 1.16 బిలియన్ డాలర్లను మాత్రమే భారత్ ఆకర్షించింది. యూఎస్ ఏకంగా 109.08 బిలియన్ డాలర్ల నిధులను అందుకుంది. నిపుణులు, విస్తృతి పెరిగినప్పటికీ చాట్‌జీపీటీ లేదా డీప్‌సీక్ వంటి ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన చాట్‌బాట్‌లు రూపొందించే స్థాయిలో భారత్ పురోగతి సాధించలేదు. ప్రతిభను అగ్రశ్రేణి పరిశోధన, పేటెంట్ పొందిన ఆవిష్కరణలు, బిలియన్ డాలర్ల ఏఐ ఉత్పత్తులను అందించేలా మలచడంలో పర్యావరణ వ్యవస్థ లేకపోవడం భారత్‌కు ప్రతికూలాంశంగా నిపుణులు చెబుతున్నారు.

# సెల్ ఫోన్‌ను సైతం మోయలేనని అనిపించింది..!

## భూమికి తిరిగొచ్చినప్పుడు అనుభవాన్ని వివరించిన శుభాంశు శుక్లా

**వాషింగ్టన్:** యాగ్జియం స్పేస్ మిషన్‌ను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న భారతీయ వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా మొదటిసారిగా మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని భార రహిత స్థితిలో గడిపి భూమిపైకి వచ్చిన తర్వాత భూగురుత్వాకర్షణ శక్తికి అలవాటు పడే క్రమంలో ఎదురైన ఇబ్బందులను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. గురుత్వాకర్షణ శక్తి ఎంత అవసరమో భూమిని వీడాకనే తమకు తెలిసిందన్నారు. 'ఒక్కసారిగా భార రహిత స్థితిలోకి మారిపోగా దానికి అలవాటు పడేందుకు కొంత సమయం పట్టింది. అదేవిధంగా, భూమికి తిరిగొచ్చాక కూడా తిరిగి గురుత్వాకర్షణ శక్తికి అలవాటు పడాల్సి వచ్చింది' అని వివరించారు. క్యాప్సూల్‌లోంచి బయటకు వచ్చాక సెల్ ఫోన్ సైతం పట్టుకోలేనంత బరువుగా మారిపోవడం తనకు ఆశ్చర్యం వేసిందని తెలిపారు. భూమి పైకి వచ్చిన కొన్ని వారాల తర్వాత సైతం అడ్జెస్ట్ కావడం కష్టమవుతుందని, పడిపోకుండా నిలబడటం, అడుగులు వేయడం సైతం ఇబ్బందిగానే ఉంటుందని చెప్పారు. అందుకే, వ్యోమగాములకు ప్రత్యేక రిహాబిలిటేషన్ కార్యక్రమం ద్వారా బలం కూడదీసుకోవడం, శరీర అవయవాల సమన్వయం, బ్యాలెన్స్ వంటివి ఒక్కటొక్కటిగా అలవాటయ్యాయన్నారు. అంతరిక్షంలో ఉన్నప్పటి మాదిరిగానే వదిలేసిన ల్యాప్‌టాప్ గాల్లోనే తేలియాడుతుందని భావించి, రూంలోనే దాన్ని పడేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. అంతరిక్షంలో శూన్య గురుత్వాకర్షణ శక్తిలో అన్నీ తేలియాడుతూనే ఉంటాయి. అటువంటి భారరహిత స్థితిలోనే తనకు అప్పగించిన ప్రయోగాలన్నిటినీ విజయవంతంగా నెరవేర్చానన్నారు. 'ఇప్పుడంతా మునుపటిలాగానే మారిపోయింది. మరో స్పేస్ మిషన్‌కు సిద్ధంగా ఉన్నా'అంటూ ఆయన ప్రకటించారు. శుభాంశు అంతరిక్ష కేంద్రంలో ఉంటూ చేపట్టిన ప్రయోగాల డేటా, సేకరించిన నమూనాలు ఇప్పటికే అమెరికా నుంచి భారత్‌లోని పరిశోధన శాలలకు చేరాయి. త్వరలో భారత్‌కు రానున్న శుభాంశు శుక్లా ఆ ప్రయోగాల గురించి శాస్త్రవేత్తలకు వివరించనున్నారు.





# ఓజీ మొదటి లిరికల్ సాంగ్ రిలీజ్

రీసెంట్‌గా పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' బాక్సాఫీస్ దగ్గర పూర్తిగా చతికిలపడింది. దీంతో అభిమానులు ఈ మూవీ గురించి మర్చిపోవడం మొదలుపెట్టారు. ఈ సెప్టెంబరు చివర్లో రిలీజయ్యే 'ఓజీ' కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ సినిమా నుంచి 'ఫైర్ స్ట్రోమ్' అంటూ సాగే తొలి లిరికల్ గీతాన్ని రిలీజ్ చేశారు.

పాట గురించి రిలీజ్ ముందు వరకు హైప్ ఎక్కువగానే ఇచ్చారు గానీ తమన్ ఇదివరకే కంపోజ్ చేసిన పాటల్లానే బాగుంది. కాకపోతే మరీ సూపర్‌గా అయితే అనిపించలేదు. అదే టైంలో లిరిక్స్‌ని మ్యూజిక్ డామినేట్ చేసినట్లు అనిపించింది. ప్రస్తుతానికైతే అభిమానులకు నచ్చినట్లే కనిపిస్తోంది. రానురాను పాట అలవాటు అవుతుందేమో చూడాలి.

'ఓజీ' సినిమాలో పవన్ సరసన ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా చేసింది. సుజీత్ దర్శకుడు కాగా.. డీవీవీ దానయ్య భారీ బడ్జెట్‌తో నిర్మించారు. సెప్టెంబరు 25న ఈ మూవీ థియేటర్లలోకి రానుంది. అదే రోజున బాలకృష్ణ 'అఖండ 2' రిలీజ్ కూడా ఉంది. మరి ఇద్దరు పోటీకి దిగుతారా? లేదంటే ఎవరైనా తప్పుకొంటారా అనేది చూడాలి?

### మహావతార్ నరసింహ

# ఆల్‌టైమ్ రికార్డ్..



'మహావతార్ నరసింహ' యానిమేటెడ్ చిత్రం ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది. ఎలాంటి తారాగణం లేకుండానే విడుదలైన ఈ చిత్రం అనేక రికార్డ్‌లను క్రియేట్ చేసింది. కలెక్షన్ల పరంగా ఇప్పుడు ఏకంగా ఇండియన్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను క్రియేట్ చేసింది. 'మహావతార్' సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా జులై 25న విడుదలైన ఈ చిత్రం చాలాచోట్ల థియేటర్స్ కూడా హౌస్‌ఫుల్ అవుతున్నాయి. బుక్‌మైషోలో ఏకంగా ప్రతిరోజు రెండు లక్షలకు పైగా టికెట్లు తెగుతున్నాయి. క్లీమ్ ప్రొడక్షన్స్, ప్రఖ్యాత హోంబలే ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ మూవీని నిర్మించాయి. తెలుగులో గీతా అర్ట్స్ నుంచి అల్లు అరవింద్ విడుదల చేశారు. దర్శకుడు అశ్విన్ కుమార్ తెరకెక్కించిన 'మహావతార్ నరసింహ' సినిమాను చూసేందుకు పిల్లలు నుంచి పెద్దల వరకు అన్ని వర్గాల ప్రేక్షకులు వెళ్తున్నారు. దీంతో 8రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 60.5 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పటి వరకు ఇండియన్ సినిమా మార్కెట్‌లో విడుదలైన అన్ని యానినేషన్ సినిమాల తాలూకా వసూళ్ల రికార్డులను మహావతార్ దాటేసింది. ఇండస్ట్రీలో ఆల్‌టైమ్ రికార్డ్‌ను క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమా యూఎస్ మార్కెట్‌లో కూడా ఇదే రేంజ్ ఓపెనింగ్స్ సాధించింది. ఏకంగా వన్ మిలియన్ క్లబ్‌లో కూడా చేరింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషలలో ఇప్పటికీ అదే స్ట్రాంగ్ బుకింగ్స్ తో దూసుకెళ్తున్న ఈ చిత్రం ఎక్కడ ఆగుతుందో చూడాలి. ఇది డివైన్ బ్లాక్‌బస్టర్ అని చిత్ర మేకర్స్ పేర్కొన్నారు.

### ప్రేమ రూమర్స్..

# సీక్రెట్‌గా మూవీ చూసిన రష్మిక



విజయ్ దేవరకొండ పేరు చెప్పగానే చాలామందికి అతడి సినిమాల కంటే రష్మికనే ముందు గుర్తొస్తుంది. ఎందుకంటే గతంలో కలిసి నటించిన వీళ్లు.. ప్రస్తుతం ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకుంటారనే రూమర్స్ ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉంటాయి. రీసెంట్ టైంలో ఈ పుకార్లని బలపరిచేలా విజయ్, రష్మిక వేర్వేరు సందర్భాల్లో చేసిన కామెంట్స్ చర్చనీయాంశమయ్యాయి. ఇప్పుడు రూమర్ బాయ్‌ఫ్రెండ్ కోసం రష్మిక మరో క్రేజీ పని చేసింది. ఆ విషయాన్ని నిర్మాత నాగవంశీ బయటపెట్టారు.

విజయ్ దేవరకొండ లీడ్ రోల్ చేసిన 'కింగ్డమ్' మూవీ రీసెంట్‌గా థియేటర్లలోకి వచ్చింది. మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ బాగానే పెర్ఫార్మ్ చేస్తోంది. రిలీజ్ రోజే.. 'మనం కొట్టినం' అని సంతోషంగా సినిమా సక్సెస్ గురించి రష్మిక పోస్ట్ పెట్టింది. ఇప్పుడు సీక్రెట్‌గా హైదరాబాద్‌లోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్‌కి వెళ్లి మరీ ఈ మూవీ చూసొచ్చింది. తాజాగా పలువురు మీడియా వాళ్లతో రౌండ్ టేబుల్ ఇంటర్వ్యూ జరగ్గా.. ఇందులో మాట్లాడిన నాగవంశీ ఈ సంగతి చెప్పుకొచ్చారు.

భ్రమరాంబ థియేటర్‌లో రష్మిక.. 'కింగ్డమ్' చూడాలనుకుందని, అయితే ఈమె వెళ్లిన తెలిస్తే ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో రహస్యంగా వెళ్లి సినిమా చూసొచ్చారు అని నాగవంశీ.. అసలు సంగతి చెప్పారు. దీంతో విజయ్ దేవరకొండ ఫ్యాన్స్ తెగ సంబరపడిపోతున్నారు. విజయ్‌రష్మిక బాండింగ్ అంటే ఇది అని మాట్లాడుకుంటున్నారు. ఇకపోతే 'కింగ్డమ్' చిత్రానికి రెండు రోజుల్లో రూ.53 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్ వచ్చాయని నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. చూస్తుంటే మరి కొన్ని రోజుల్లో రూ.100 కోట్ల మార్క్ దాటేయడం గ్యారంటీ అనిపిస్తోంది.

# ఎన్టీఆర్ అన్న కోసం ఆ సినిమా టైటిల్ మార్చుకున్నాం : విజయ్ దేవరకొండ

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ చాలా రోజుల తర్వాత కింగ్‌డమ్ సినిమాతో సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం నాగవంశీ నిర్మించాడు. గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో రన్ అవుతుంది. అయితే ఈ సినిమా టైటిల్‌పై ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు విజయ్. ఈ సినిమాకు మొదటగా నాగదేవర 'నాగ దేవర' అనే టైటిల్ అనుకున్నామని అయితే అప్పటికే ఎన్టీఆర్ అన్నా దేవర ప్రకటించడంతో ఈ టైటిల్ వదులుకున్నట్లు విజయ్ చెప్పుకొచ్చాడు.



అయితే ఈ సినిమాలో సాంగ్ డిలీట్ చేయడంపై విజయ్ స్పందిస్తూ.. ఆ ఆలోచన తనది కాదని.. దర్శకుడు గౌతమ్.. ఎడిటర్ నవీన్ నూలి కలిసి తీసుకున్న నిర్ణయం అని చెప్పాడు. అయితే ఎందుకు పాటను తొలగించారని ప్రేక్షకుల ఇప్పుడు అడుగుతున్నారు. ఆ పాటను జత చేసే పనిలో మా మేకర్స్ పనిచేస్తున్నారంటూ విజయ్ చెప్పుకొచ్చాడు. విజయ్ అప్‌కమింగ్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుంది. అలాగే రవి కిరణ్ కోలాతో రౌడీ జనార్ధన్ అనే సినిమాను చేయబోతున్నాడు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com